

సుజాతనగర్‌లో అయిలయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

ఆదర్శ కమ్యూనిస్టు అయిలయ్య

- ఆయన ఆశయాలను కొనసాగించడమే నివాళి
- మతోన్మాద శక్తులను అడ్డుకోవాలి
- సీపీఎం నేతలు తమ్మినేని, జాన్‌వెస్లీ
- సుజాతనగర్‌లో ఘనంగా సంస్మరణ సభ
- కాసాని దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

సుజాతనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాసాని అయిలయ్య ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శ్లాఘించారు. సుజాతనగర్ మండల కేంద్రంలో ఆదివారం సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని అయిలయ్య సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కాసాని పోరాట చరిత్రను తెలిపే ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సభలో కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి ఖమ్మంజిల్లా సీపీఎం నేతలు, ఇతర పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని అయిలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుజాతనగర్ మండల కేంద్రం వద్ద గల పెట్రోల్ బంక్ వద్దనుంచి సెంటర్ మీదుగా హైస్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న కెచ్చల రంగయ్య

ప్రజల కోసం తపించిన 'రాయల'

- జీవితమంతా అతి, మితవాదాలకు వ్యతిరేకంగా పోరాడారు
- నూతన పోరాట ప్రజాపంథాకు బాటలు వేశారు
- రాయల సుభాష్ చంద్రబోస్‌కు వక్తల ఘన నివాళి
- నగరంలో ఘనంగా 9వ వర్ధంతి

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తన జీవిత కాలంలో 50ఏళ్ల పాటు అతి, మితవాదాలకు వ్యతిరేకంగా ప్రజాపంథా కోసం అజ్ఞాత పోరాటాలు జరిపిన యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్ అలియాస్ రవన్న అని వక్తలు కొనియాడారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో రవన్న 9వ వర్ధంతి సభను ఆదివారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ సెక్రటరియేట్ సభ్యుడు కెచ్చల రంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, విద్యా పరిరక్షణ జాతీయ కమిటీ సభ్యుడు రమేష్ పట్నాయక్.. రవన్న చిత్రపటానికి పూలమాల వేయగా సభకు హాజరైన నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ప్రత్యేక సెమినార్‌లు, ప్రసంగాలు నిర్వహించారు. అంతకుముందు నాయకులు, కార్యకర్తలు పెవిలియన్ మైదానం నుంచి వైరా రోడ్డు, (మిగతా 6వ పేజీలో)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తాతా మధు

తెలంగాణ పరువు గోవిందా..

- కాంట్రాక్టర్లకు డబ్బు చెల్లించడం చేతగాని నువ్వే ఓ పెద్ద సన్నాసివి
- 'సీతారామ'లో అదనంగా కేటాయించిన రూ.970 కోట్లు ఎవరి జేబులు నింపేందుకు?
- డిప్యూటీ సీఎం భట్టిపై ఎమ్మెల్సీ తాతా మధు ఫైర్

భద్రాచలం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో తొలిసారిగా సెక్రటరియేట్‌లో పరిపాలన భవనం వద్ద 250 మంది కాంట్రాక్టర్ల ధర్నాతో తెలంగాణ రాష్ట్ర పరువు పోయిందని బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు, వివిధ సంస్థలకు, కళాశాలలకు చెల్లించాల్సిన మొత్తానికి కమీషన్లను తీసుకుంటోందని ఆరోపించారు. మాటలు చెప్పి పనులు చేయని సన్నాసి కేసీఆర్ అంటూ విమర్శించే నువ్వే కాంట్రాక్టర్లకు డబ్బు చెల్లించడం చేతగాని నువ్వే ఓ సన్నాసివని డిప్యూటీ సీఎం భట్టిని దుయ్యబట్టారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడారు. కాంట్రాక్టర్లకు డబ్బులివ్వడం చేతగాని నీకు హైదరాబాద్ నుంచి ఖమ్మం (మిగతా 6వ పేజీలో)

ఉమ్మడి జిల్లాలో అధికార కాంగ్రెస్ కేడర్ మంత్రుల మధ్య నలిగిపోతోంది. ఎవరి వైపు వెళితే ఏమి జరుగుతుందో.. తమకు వచ్చే పదవులకు ఎక్కడ ఇబ్బంది ఉంటుందోనన్న ఆందోళన, ఆవేదన అటు ఎమ్మెల్యేలు, ఇటు నాయకుల్లో కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 8 మంది కాంగ్రెస్ నుంచి గెలవగా, కొత్తగూడెంలో కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ నుంచి గెలిచారు. భద్రాచలం నుంచి బీఆర్ఎస్ తరపున గెలిచిన తెల్లం వెంకటరావు ఆ తర్వాత కాంగ్రెస్ గూటికి చేరారు. ఖమ్మం, పాలేరు, మధిర నియోజక వర్గాల నుంచి గెలిచిన ముగ్గురు రాష్ట్ర కేబినేట్‌లో మంత్రులుగా ఉన్న విషయం విదితమే. ఉపముఖ్య మంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యవహరిస్తున్నారు.



- ఎవరి వైపు ఉండాలో తెలియక ఎమ్మెల్యేల సతమతం
- ఎవరివైపు ఉంటే ఏం జరుగుతుందోనని ఆందోళన
- ద్వితీయ శ్రేణి నాయకులదీ అదే పరిస్థితి
- ముగ్గురు మంత్రులు కలిసి ఒకేసారి పాల్గొన్న కార్యక్రమాలు అరుదు
- సమన్వయంపై దృష్టి పెట్టని జిల్లా ఇన్‌చార్జి మంత్రి
- ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీలో గందరగోళం

తీన్‌మార్.. పరేషాన్..

ముగ్గురు మంత్రులు... కాంగ్రెస్‌లో మూడు పవర్ సెంటర్లు...

ఖమ్మం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వైరా నుంచి గెలిచిన మాలోతు రాందాస్‌నాయక్, సత్తుపల్లి నుంచి గెలిచిన మట్టా రాగమయి లౌక్యంగానే వ్యవహరిస్తూ ముగ్గురు మంత్రులను కలుస్తూ, తమ నియోజవర్గాల్లో పర్యటనలకు ఆహ్వానిస్తున్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సంబంధాలు పెట్టుకుని అభివృద్ధి పనులు చేయించుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ... రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గీయులుగా కొనసాగుతున్నారు. తమ తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి, శంకుస్థాపన కార్యక్రమాలకు పొంగులేటినే ఆహ్వానిస్తున్నారు. భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావుతో స్నేహపూర్వకంగా సమావేశాలప్పుడు కలుస్తున్నా నియోజకవర్గస్థాయి పర్యటనలు, అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రం ఆహ్వానించడం లేదు. అశ్వారావుపేట నియోజకవర్గం మంత్రి తుమ్మల స్వస్థలం కావడంతో అప్పుడప్పుడు (మిగతా 6వ పేజీలో)



వైరా మేజర్ బీబీసీ కెనాల్ కాల్వ తూము వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మా పంటలు ఎండిపోవాలా?

- పై భూములను వదిలేసి, నీళ్లు కిందకు ఎలా తీసుకెళ్తారు...
- ఇరిగేషన్ అధికారులపై వైరా మేజర్ ఆయకట్టు రైతుల ఆగ్రహం

కొణిజర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పైన తమ పంటలు ఎండిపోతుంటే కిందకు నీళ్లు ఎలా తీసుకెళుతున్నారని, తమ పంటలు తడిసేంతవరకు నీళ్లు ఇవ్వాలని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వైరా మేజర్ ఆయకట్టు రైతులు ఆదివారం బోనకల్ బ్రాంచి కెనాల్ కాల్వ వైరా మేజర్‌కు వెళ్లే తూము వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. నీటి పారుదలశాఖ అధికారులు ఎండుతున్న పంటలను పట్టించుకోకుండా బోనకల్ మండలానికి నీళ్లు తీసుకెళుతున్నారని, తమ పంటలు కూడా తడవాలి కదా అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మేము కూడా రైతులమేనని, తమ పంటలను కూడా అధికారులు కాపాడాలని కోరారు.

వైరా మేజర్ పరిధిలో రైతులు మొక్కజొన్న, మిర్చి సాగు చేశారు. నీళ్ల సమయానికి అందక తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు మేజర్ పరిధిలో పంటలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ముందున్న మేజర్లకు నీళ్లు ఇవ్వకుండ కిందకు నీళ్లు తీసుకెళుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పంటలు ఎండిపోతే అధికారులదే బాధ్యత అని రైతులు మండిపడ్డారు. చివరి భూములు తడిసేంత వరకు నీళ్లు ఇవ్వాలని ఆయకట్టు రైతులు కోరారు.

విషయం తెలుసుకున్న నీటిపారుదలశాఖ ఏఈ నాగేంద్రబాబు రైతులతో మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఆందోళన విరమించాలని కోరటంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో వైరా మేజర్ మాజీ నీటిసంఘం అధ్యక్షుడు రాంపుడి సురేష్, 19వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇమ్మడి రామారావు, వైరా మేజర్ పరిధిలోని పల్లిపాడు, లాలాపురం, దిద్దుపుడి, గోపారం, చిన్నమునగాల రైతులు ఖాసీం, రాధాకృష్ణ, నరసింహారావు, మహబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎండలు ముదురుతున్నాయి.. జాగ్రత్త!

- ప్రజలు ఆరోగ్యపరంగా అప్రమత్తంగా ఉండాలి
- ప్రతి పీహెచ్‌సీలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధం
- జిల్లా ఆస్పత్రిలో 10 పడకలతో వడదెబ్బ బాధితులకు చికిత్సలు
- జిల్లా కేంద్రంలో 9704150025 కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలి
- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి

ఈ అంశమే...



ఖమ్మం కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): 'వేసవి తీవ్రత పెరుగుతోంది.. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ముందు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యక్తిగతంగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి..' అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి సూచించారు. వేసవిలో వడదెబ్బకు లోనయ్యే వారికోసం వైద్యపరమైన కార్యాచరణ రూపొందించామని వివరించారు. జిల్లాలోని 26 ప్రాథమిక, 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 60వేల ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. ఆదివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు

జిల్లాలో అన్ని మండలాల్లోనూ ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి వైద్యశాఖ (మిగతా 6వ పేజీలో)



యాసంగిలో వరి జోరు

- సన్న రకాలకు మొగ్గు చూపిన రైతాంగం
- జిల్లాలో 1,81,130 ఎకరాల్లో సాగు
- వారంలో మొదలుకానున్న కోతలు

సత్తుపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి సాగు ఆశాజనకంగా ఉంది. ఖమ్మం జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టులోనూ, చెరువు, కుంటలు, బోర్ల ఆధారంగా యాసంగి వరి సాగు చేపట్టారు. సాధారణంగా యాసంగిలో రైతులు వరి సాగు చేస్తారు. గతంలో దొడ్డు రకం వడ్లను ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించటంతో ఈ యాసంగిలో పెద్ద మొత్తంలో సన్న రకాలను సాగు చేశారు. ఖమ్మం జిల్లాలో 1,81,130 ఎకరాల్లో రైతులు యాసంగిలో వరి సాగు చేయగా.. దీనిలో సన్న రకం వరి 1,24,140 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5204, హెచ్ఎంటీ సోనా తదితర సన్న రకాలను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

వారంలో వరి కోతలు

సత్తుపల్లి మండలంలో రైతులు యాసంగి వరిసాగును ముందుగా చేపట్టడంతో కొన్ని గ్రామాల్లో మరో వారంలో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. బేతుపల్లి పెద్ద చెరువు, బోర్ల ఆధారంగా ఈ మండలంలో వరి సాగు చేపట్టారు. వచ్చే నెల 15 నాటికి సత్తుపల్లి మండలంలో వరి కోతలు పూర్తి కానున్నాయి. వేంసూరు మండలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మిగిలిన మండలాలు, నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉంది. వచ్చే నెలలో వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి.

ఆశాజనకంగా దిగుబడి

ప్రస్తుత యాసంగిలో జిల్లాలో వరి సాగుకు నీటి ఎద్దడి లేకపోవటంతో పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. ఇటీవల ప్రభుత్వం గోదావరి నీటిని సీతారామా కాలువల ద్వారా నాగార్జునసాగర్ కాలువలకు మళ్లించటంతో చిరుపొట్ట దశలో కొన్ని ప్రాంతాల్లో సాగు నీరు అవసరం తీరింది. దీంతో సాగు నీటి సమస్య కూడా లేని పరిస్థితి. వరి సాగులో కంకినల్లి, ఆకు చుట్టు, అగ్గి తెగులు సోకినా వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. దీంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరాకు సగటున 25 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. అకాల వర్షాలు లేకుంటే యాసంగిలో వరి సాగు చేసిన రైతులు పరిస్థితి మెరుగ్గా ఉండే అవకాశాలున్నాయి.

పోలీసుల అదుపులో దోపిడీ దొంగలు

సీపీ ఆదేశాలతో సవాల్‌గా తీసుకున్న వైరా పోలీసులు

వైరా, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఫిబ్రవరి 12న దోపిడీకి పాల్పడిన దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వైరా మునిసిపాలిటీ 9వ వార్డులోని లీలాసుందరయ్యనగర్‌లో ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళ శీలం వెంకట్రావమ్మను సర్వే పేరుతో నమ్మించి ఆ తర్వాత ఆమెపై దాడిచేసి చేతులు, కాళ్లు, నోరు ప్లాస్టిక్ స్టిక్కర్లతో బంధించి రూ.15లక్షల విలువైన బంగారు ఆభరణాలను నలుగురు అగంతుకులు దోచుకెళ్లిన విషయం తెలిసిందే. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశాలతో ఈ దోపిడీని వైరా పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. వైరా ఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్ పర్యవేక్షణలో వైరా సీఐ ఎన్.సాగర్ ఆధ్వర్యంలో ఐదు పోలీసు బృందాలు గాలింపు చేపట్టి ఎట్టకేలకు దోపిడీ దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఏపీలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్లకు చెందిన నలుగురు దోపిడీ దొంగలను సీఐ సాగర్ ఆధ్వర్యంలోని పోలీసు బృందాలు అదుపులోకి తీసుకొని వైరాకు తరలించి విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ దొంగలకు తీవ్ర నేరచరిత్ర ఉందని, అనేక చోట్ల దోపిడీలకు పాల్పడినట్లు తేలిందని తెలిసింది. ఒకట్రెండురోజుల్లో పోలీసులు అధికారికంగా ఈ దోపిడీ దొంగల విషయాన్ని ప్రకటించనున్నట్టు సమాచారం.




నెమలిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం

12 నుంచి నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

14న స్వామివారి కల్యాణం

వైరా, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భక్తులకు కొంగుబంగారంలా విరాజిల్లుతున్న ఖమ్మంజిల్లాకు సరిహద్దుల్లో ఉన్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలిలోని శ్రీ వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 12నుంచి 17వరకు జరుగనున్నాయి. 12న అంకుర్పారణ(స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుట), 13న శేష వాహన మహోత్సవం, 14న శ్రీ వేణుగోపాలస్వామివారి కల్యాణోత్సవం, 15న రథోత్సవం, 16న పల్లకి ఉత్సవం(వసంతోత్సవం), 17న పవళింపు సేవ నిర్వహించనున్నారు. భౌగోళికంగా నెమలి ఏపీలో ఉన్నప్పటికీ శ్రీ వేణుగోపాలస్వామివారిని తెలంగాణకు చెందిన అధిక సంఖ్యలోని భక్తులే కొలుస్తున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్, ఖమ్మంజిల్లాలకు చెందిన వేలాదిమంది భక్తులు ఈ స్వామివారిని కొలుస్తుంటారు. ప్రతి సోమ, శుక్రవారాల్లో భారీ సంఖ్యలో భక్తులు ఇక్కడకు వచ్చి పూజలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. ఖమ్మం, కొణిజర్ల, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం, వైరా, తల్లాడ, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి మండలాల ప్రజలు వేణుగోపాలస్వామివారిని తమ ఆరాధ్య దైవంగా కొలుస్తుంటారు. 12నుంచి 17వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నప్పటికీ 14న జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవానికి వైరా, మధిర నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను నడపనున్నారు. వైరా మండలంలోని దాచాపురం, గరికపాడు, గన్నవరం, మధిర మండలంలోని రామచంద్రాపురం, జాలిముడి తదితర గ్రామాల వారు ఈ వేడుకల నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ఈవో నేల సంధ్య కోరారు.





రాజధాని వీడని 'అపెడా'

రైతులను సాగుపరంగానే కాకుండా వ్యాపారరంగంపైనా అవగాహన కల్పించే ప్రభుత్వ సంస్థలు అనేకం ఉన్నా అన్నదాత దరి చేరడం లేదు. శిక్షణ కల్పించే సంస్థలు కేవలం హైదరాబాదుకే పరిమితం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో వాణిజ్య, ఆహార, నూనెగింజల పంటలతో పాటు పండ్లు, కూరగాయల ఉత్పత్తులు కూడా పెద్దఎత్తున జరుగుతున్నాయి. విభిన్నతరహాలో సాగవుతున్న పంటల్లో రైతులు అధిక ఉత్పత్తులు సాధిస్తున్నా సరైన ధరకు అమ్ముకుని అధిక లాభాలు మాత్రం గడించడంలేదు. పండించిన పంటలను పలురకాల ఉత్పత్తులుగా మార్చి వారిని వ్యవసాయపరంగా, ఆర్థికంగా లాభాలు గడించేలా చేయూతనిచ్చే సంస్థల్లో 'వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార పదార్థాల ఎగుమతి అభివృద్ధి సంస్థ' (అపెడా) ఒకటి. ఈసంస్థ రైతులకు శిక్షణ ఇస్తే జిల్లాలో రైతులు తమపంటలను స్వయంగా ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేసే అవకాశాలు ఉన్నాయి. కానీ ఈసంస్థ జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదు.

- రైతుల దరి చేరని 'వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార పదార్థాల ఎగుమతి అభివృద్ధి సంస్థ'
- అందని ఆధునిక నైపుణ్య శిక్షణ
- సామర్థ్యం ఉన్నా వ్యాపార రంగంలో వెనుకంజ

ఖమ్మం, మార్చి9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అపెడా సేవలు హైదరాబాదుకే పరిమితమవుతున్నాయి. వాస్తవానికి ఈప్రభుత్వ రంగ సంస్థ జిల్లాల్లో ఔత్సాహిక యువ రైతులకు దేశ, విదేశాలకు పంటలు ఎగుమతిచేసే విధానంపైనా శిక్షణ కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులను ఆదిశగా అభివృద్ధి పరచడంపై కార్యక్రమాలు నిర్వహించాలి. నిజామాబాద్ జిల్లాలో మాత్రమే ఈసంస్థ రైతులకు శిక్షణ ఇచ్చి ప్రోత్స హిస్తున్నట్లు తెలిసింది. వ్యవసాయాధారిత ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఈసంస్థ సేవలు అందిస్తే జిల్లా నుంచి పలురకాల పంటలు దేశ, విదేశాలకు రైతులే స్వయంగా ఎగుమతి చేసేకుని గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉంటుంది. ఉమ్మడిజిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాల్లో మిర్చి సాగవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా మిర్చి సాగుతువున్న ఈజిల్లాలో మిర్చి నాణ్యత, ఎగుమతులకు సంబంధించి రైతులకు, రైతు సంఘాలకు శిక్షణ ఇస్తే స్థానిక మార్కెట్లకే కాకుండా రైతులు నేరుగా విదేశాలకు సైతం ఎగుమతులు చేసే అవకాశం కలుగుతుంది. మిర్చి ఆహార ఉత్పత్తులతో పాటు రంగులు తయారీ, కెమికల్ తయారీకి ఔషధ మందుల తయారీలోను ఉపయోగపడుతుంది. మంచి ధర రావాలంటే రైతులు మిర్చిసాగులో నాణ్యత ను పెంచుకోవడంతోపాటు ఉత్పత్తి అయిన పంటను కూడా నాణ్యతాపరంగా తగిన ప్రమాణాలు పాటింపచేసే ఎగుమతి స్థాయికి తీర్చిదిద్దాలంటే రైతులకు అవగాహన అవసరం ఉంది.

రెట్టింపు ధరలకు అవకాశం..

ఉమ్మడిజిల్లాలో సుమారు 80వేల ఎకరాల్లో మొక్కజొన్న, 50వేల ఎకరాలపైగా మామిడి, జీడిమామిడి పంటలు సాగవుతున్నాయి. సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు జిల్లాకు వచ్చి రైతుల తోటలన కొనుగోలు చేసి మామిడిని వారే దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వాస్తవానికి రైతులకు ఈతరహా శిక్షణ కల్పిస్తే రైతులు లేదా రైతుసంఘాలు, రైతు సొసైటీ లద్వారా ఎగుమతులు చేసుకుని రెట్టింపు ధరల పొందే సౌలభ్యం ఉంది.

డిమాండ్ ఉన్న పంటల సాగు..

యువరైతులకు ఆంగ్లపరిజ్ఞానంతోపాటు ఇంటర్‌నెట్ వినియోగం, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల తీరుపై ఆన్‌లైన్‌లో సమాచారం తెలుసుకునే నైపుణ్యం ఉంది. అయితే అపెడా వంటి సంస్థలు రైతులును ఈదిశగా అభివృద్ధి చేస్తే మరింత బాగుంటుంది. జిల్లాలో బొప్పాయి, జామ, పుచ్చ, సపోటా, టమోటా, పచ్చిమిర్చి తదితర రకాల కూరగాయలుకూడా భారీగా సాగవుతున్నాయి. వీటితోపాటు అశ్వారావుపేట ప్రాంతంలో కోకో, వక్క, జాజి వంటి సుగంధద్రవ్యాల పంటలుకూడా సాగవుతున్నాయి. జిల్లాలో భిన్నరకాలైన ఆహార పంటలు , కూరగాయలు సాగు విస్తారంగా ఉన్నప్పటికి ఈపంటలు అధునాతన పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ రంగాలపై రైతులకు అవగాహన కలిపిస్తే నేరుగా రైతులు డిమాండ్ ఉన్నమార్కెట్‌లకు పంటలను ఉత్పత్తిచేస్తే మంచి ధరలు పొందే అవకాశం ఉంటుంది. రైతులకు శిక్షణ అందించే అపెడా కార్యకలాపాలను జిల్లా రైతులకు అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది.

బుగ్గపాడులో ఫుడ్‌పార్కు ఉన్నా..

సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఫుడ్‌పార్కు ఏర్పాటు చేశారు. ఈఫుడ్‌పార్కులో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలన్నా.. ఉమ్మడిజిల్లానుంచి వ్యవసాయ ఉత్పత్తులు ప్రాసెసింగ్‌తో ఫుడ్‌పార్కుకు పంపాలన్నా.. అపెడా వంటి సంస్థల శిక్షణ తప్పనిసరిగా అవసరం. ఉమ్మడిజిల్లాలో చైతన్యవంతమైన స్వయం సహాయకసంఘాల గ్రూపులు అధికంగా ఉన్నాయి. మిర్చి, టమాట, మొక్కజొన్న కంది ,మినుము, తదితర పంటల నుంచి ఉప ఉత్పత్తులు తయారీలో శిక్షణ ఇస్తే స్థానికంగా మహిళలకు ఉపాధి పెరగడంతో పాటు రైతులకు కూడా గిట్టుబాటు ధరల వచ్చే అవకాశం ఉంటుంది

సేంద్రియ పంటలే ఆరోగ్యదాయకం

కిసాన్ మోర్చా బాధ్యుడు నల్లమల



రైతు దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం మార్కెట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సేంద్రియ పంటలే ఆరోగ్యానికి మూలమని కిసాన్ మోర్చా బాధ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బ్యాంక్ కాలనీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో రసాయనాలతో పండించిన ఆహార పదర్థాలు తిని అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ప్రజలు ప్రకృతి విధానంలో పండించిన పంటలు తిని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని, తద్వారా సేంద్రియ రైతులను సైతం ప్రోత్సహించే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంగా యువ శాస్త్రవేత్త డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రసాయనాలతో పండించిన కూరగాయలు తిని వెంటనే ఆస్పత్రుల పాలవుతున్నామని, మన దగ్గర ఎంత డబ్బు ఉన్నా ఆరోగ్యానికి మించింది ఏదీ లేదని ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ప్రజలు ప్రకృతి పంటల వైపు ఆసక్తి పెంచుకుంటారో వారికి అనారోగ్యం దరిచేరదని అన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన సేంద్రియ పసుపు రైతు, ఉచిత క్యాన్సర్ మందు దాత మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు వాడకుండా పుడమి తల్లిని కాపాడుకుంటూ గత 30 ఏళ్ళుగా వ్యవసాయం చేస్తున్నాని అన్నారు. అనంతరం ఆదర్శ రైతు అనుముల రామిరెడ్డి మాట్లాడుతూ సేంద్రీయ పంటలు తింటే శారీరకంగా ఫిట్‌గా ఉంటారని తెలిపారు. నగరంలో ప్రతి నెలా రెండో శనివారం, ఆదివారం రెండు రోజులు నిర్వహించే మూల సంతను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామభారతి బాధ్యురాలు కుతుంబాక మాధవి, ఆధర్శ రైతు రామారావు ఉన్నారు.

మహిళా ఉత్పత్తులకు విశేష ఆదరణ



మహిళలు ప్రదర్శించిన దుస్తులు, వస్తువులు

కొత్తగూడెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ జితేష్.వి.పాటిల్ ఆలోచన మేరకు ఎక్స్ ఫ్లోర్ భద్రాద్రి కొత్తగూడెం కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదారాబాద్‌లోని మాదాపూర్‌లోని నాలెడ్జి సిటీలో ఓ సంస్థ నిర్వహించిన రన్ ఫర్ హర్ అనే కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా నుంచి మహిళలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. మహిళలు స్వయంగా తయారు చేసిన కరక్కాయ, టీపొడర్, తేనే, ఫ్లేవర్ తేనే, విప్పపువ్వులు, విప్పనూనె, మిల్లెట్స్‌తో తయారు చేసిన బిస్కెట్స్, సబ్బులు వంటి వివిధ ఉత్పత్తులను ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో తయారుచేసి ప్రదర్శించారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లు సందర్శకులను విశేషంగా ఆకర్షించాయి. ఈ ఉత్పత్తులను పలువురు విశేషంగా కొనుగోలు చేసి పోత్సాహం చూపించారు. కలెక్టర్ జితేష్.వి.పాటిల్ ఆలోచనకు మహిళా సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నాగజ్యోతి, ఏపీఎం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్స్ అందించటం అభినందనీయం

మాజీ మంత్రి పువ్వాడ అజయ్



కిట్లు అందజేస్తున్న పువ్వాడ అజయ్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాల ముస్లింలు కూడా ఇతరుల వలే రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొనేందుకు ప్రత్యేకంగా విలువైన రంజాన్ కిట్లను జవాద్ ఆధ్వర్యంలో పంపిణీ చేయటం అభినందనీయమం అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని నూతన బస్టాండ్ ఎదురుగా ఉన్న మక్కా మసీదులో అవామే ఏ హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మెన్ హఫీజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన కిట్స్ పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి పాల్గొని మాట్లాడారు. నగరంలో అత్యధిక సంఖ్యలో ముస్లింలు పేదలుగా ఉన్నారని వారికి రంజాన్ కిట్స్ పంపిణి చేసి ఆదుకోవటం మంచి ప్రయత్నం అని అన్నారు. రంజాన్ పర్వదినాన్ని సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చైర్మెన్ హఫీజ్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ కిట్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. మొత్తం రూ.3500ల విలువగల రంజాన్ కిట్స్‌లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ తాజుద్దీన్, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు డి. వెంకటేశ్వర్లు, శీలంశెట్టి వీరభద్రం, నాగండ్ల కోటేశ్వరరావు, సుడా మాజీ చైర్మెన్ బచ్చు విజయ్‌కుమార్, మక్కా మసీదు అధ్యక్షుడు అలీ ఖాన్ పాల్గొన్నారు.

ఎండలు ముదురుతున్నాయి..

(5వ పేజీ తరువాయి)

అధికారులను అప్రమత్తం చేశాం. మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో బృందాలను ఏర్పాటు చేశాం. ఆ పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ల పరిధిలో ఎవరికైనా వడదెబ్బ తగిలినట్టు సమాచారం అందితే ఈ బృందాలు స్పందించి వైద్యచికిత్సలు అందిస్తాయి. తాగునీరు కలుషితం కాకుండా, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు తాగునీటిని అందించేలా కృషి చేయనున్నాం. వేసవిలో ఫుడ్ పాయిజనింగ్, తాగునీరు కలుషితం కాకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ కార్యాచరణ చేపట్టాం.

60 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు

జిల్లాలో 26 ప్రాథమిక, 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 60వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాం. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో వీటిని అందుబాటులో ఉంచాం. వడదెబ్బ తగిలడం, డీహైడ్రేట్ అయిన వారికి చికిత్సల కోసం ఐవీ ఫ్లూయిడ్స్, సెలైన్ బాటిళ్లను అందుబాటులో ఉంచాం.. ఎండదెబ్బ తగలకుండా విద్యార్థులకు పాఠశాలల్లో ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యాన్ని కల్పించేలా సూచించాం.. ఎండబారి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి రోజు మజ్జిగ, గ్లూకోస్ నీరు, చిటికెడు ఉప్పు, చెంచా చక్కర గ్లాసు నీటితో కలుపుకొని సేవించినట్లైతే వేడిమి నుంచి ఉపశమనం పొందాలి. ప్రతి గ్రామంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం. ఎండతీవ్రంగా ఉన్నప్పుడు ఆరుబయట పనిచేసే వారు సూర్యరశ్మి నుంచి కాపాడుకొనేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దాహం కాకపోయినప్పటికీ ప్రతి గంటకోమారు తరచుగా నీళ్ల తాగుతూ ఉండాలి. బయటకు వెళ్లేప్పుడు వెంట ఇంటినుంచే నీళ్ల తీసుకెళ్లాలి.

జాగ్రత్తలు పాటించాలి...

తీవ్ర వేసవి దృష్ట్యా ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రాకుండా ఉండడమే శ్రేయస్కరం. ఒక వేళ తప్పనిసరిగా రావాల్సి వస్తే తలకు టోపీ, తెల్లని దుస్తులు ధరించాలి. కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి. చిన్నపిల్లలు, గర్భిణులు, వృద్ధులు బయటికి రావొద్దు. వేసవిలో నిమ్మ రసం, కొబ్బరి నీళ్ల వంటివి సేవించాలన్నారు. వడదెబ్బ నుంచి సత్వర ఉపశమనం కలుగుతుంది. వడదెబ్బ తగిలిన వారిని నీడలో చల్లని ప్రదేశాల్లో ఉంచాలి.

కంట్రోల్ రూం

ఖమ్మం వైద్యాధికారి కార్యాలయంలో 24గంటల పాటు పనిచేసేలా ప్రత్యేక హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. జిల్లాలో ఎవరైనా వడదెబ్బకు గురైనా, అపస్మారక స్థితికి చేరుకున్నా.. జిల్లా కేంద్రంలోని 97041 50025 నెంబర్‌కు సమాచారం ఇస్తే తక్షణమే అంబులెన్స్‌తో పాటు చికిత్సలకు దగ్గర్లోని పీహెచ్‌సీకి తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం.

ఆదర్శ కమ్యూనిస్టు అయిలయ్య

(5వ పేజీ తరువాయి)

సభాస్థలి వద్దకు సీపీఎం శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అయిలయ్య కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కాసాని అయిలయ్య, లక్ష్మి దంపతుల విగ్రహాలను వారు ఆవిష్కరించారు.

మతోన్మాద శక్తులతో ప్రమాదం: తమ్మినేని

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ మతోన్మాద శక్తులు దేశానికి ఎంతో ప్రమాదమని అన్నారు. ఈ ప్రమాదాన్ని ప్రధాన పార్టీలు గుర్తించి అడ్డుకోకపోతే నష్టం తప్పదని అన్నారు. తెలంగాణ ఎంతో లౌకిక విలువలు కలిగిన రాష్ట్రమని, తెలంగాణకు సాయుధపోరాటం, నిజాం వ్యతిరేక పోరాటాలు సాగించిన గొప్ప చరిత్ర ఉన్నదని అన్నారు. పరిస్థితులు మారకపోతే మనం సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం, అభివృద్ధి కోసం పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి కీలక పరిస్థితుల్లో మతోన్మాదాన్ని ఎదుర్కొని, కీలకమైన కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలా ముందుకు తీసుకుపోయే శక్తి ఒక్క కమ్యూనిస్టుల ఎర్రజెండాకే ఉందని గుర్తుపెట్టుకోవాల్సి ఉందన్నారు. అయిలయ్య లాంటి ప్రజానాయకులు మరింత మంది ఉద్భవించాలని, వారి ఆశయాలను ప్రతీ ఒక్కరు ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

కాసాని స్ఫూర్తితో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాలు చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా పోరాడిన యోధుడిగా, రాజీలేని పోరాటాలు నడిపిన నాయకుడిగా అయిలయ్యకు గుర్తింపు ఉందన్నారు. కమ్యూనిస్టులంతా ఐక్యంగా పోరాటం కొనసాగించాలని, ఇదే మన ఎర్రజెండా పోరాట యోధుడు అయిలయ్యకు ఇచ్చే నివాళి అని అన్నారు. ఉత్తమ ప్రజా నాయకుడు అయిలయ్య అని, వారితో బంధం విడదీయలేనిదని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, సీపీఎం రాష్ట్ర సీనియర్ నేత రాజారావు, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, కె.బ్రహ్మచారి, అన్నవరపు సత్యనారాయణ, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, కాంగ్రెస్ నాయకుడు కోనేరు చిన్ని, మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చింతలపుడి రాజశేఖర్; సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మండల కార్యదర్శి భూక్యా దస్రు, టీఆర్ఎస్ మండల నాయకులు సంపు, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పరువు గోవిందా..

(5వ పేజీ తరువాయి)

రావడానికి హెలీకాప్టర్ కావాలా? రోడ్డు మీద రాలేవా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితే బాగాలేనప్పుడు ఎందుకు ఈ వృథా ఖర్చులని అన్నారు.

20 శాతం కమీషన్లు..

బిల్లులు చెల్లించేందుకు 20శాతం కమీషన్ తీసుకుంటున్నట్టు కాంట్రాక్టర్లు బహిరంగంగా చెబుతున్నారని ఎమ్మెల్సీ మధుసూదన్ ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఏనాడైనా మంత్రులు కమీషన్లు తీసుకుంటూ బిల్లులు మంజూరు చేస్తున్నారని కాంట్రాక్టర్లు చెప్పారా అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల కమీషన్లు, ఇసుక దందాలే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరని, రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 30శాతం పైగా రైతు రుణమాఫీ కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లేనని ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. మళ్లీ యూరియా బస్తాల కోసం చెప్పులు లైన్లో పెట్టడంతో రాష్ట్రంలో పాత రోజులు దర్శనమిస్తున్నాయని అన్నారు. ఇసుక మాఫియా మీద ఉన్న ప్రేమ ప్రజల మీద కాంగ్రెస్‌కు లేదని దుయ్యబట్టారు.

పింఛన్లు ఎందుకు పెంచరు..?

ఏపీలో సీఎం గురువైన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఫించను రూ.2వేల నుంచి రూ.4 వేలకు పెంచి పంపిణీ చేస్తుండగా రాష్ట్రంలో ఇప్పటివరకు ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డి పింఛన్లు ఎందుకు పెంచడం లేదని ఎమ్మెల్సీ మధుసూదన్ ప్రశ్నించారు. ఉత్తర తెలంగాణ అంతా ఎండిపోయి బీడు భూములను తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాజధానిలో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని అన్నారు. త్వరలో తాగునీటి కోసం నల్లాల వద్ద కొట్లుకునే పరిస్థితి రానుందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల కష్టాలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.

ఎవరి జేబులు నింపడానికి నిధులు..

ఉమ్మడి జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించేందుకు రూ.7వేల కోట్ల నుంచి రూ.13వేల కోట్లతో అంచనాలు పెంచి నాడు తమ ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. తాము ఆనాడు చేపట్టిన పనులు 99.80 శాతం పూర్తయ్యాయని అన్నారు. అయితే ఆనాడు ఇప్పటి మంత్రులు భట్టి, ఉత్తమకుమార్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి జేబులు నింపుకోవడం కోసం, కాసులు కూడబెట్టుకోవడం కోసమేనని విమర్శించిన విషయాన్ని ఉదహరించారు. మరి నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అయిన పనులకు రూ.970 కోట్లు ఎందుకు కేటాయించిందని ప్రశ్నించారు. ఎవరి జేబులు నింపుకోవడం కోసం ఈ కేటాయింపులని విమర్శించారు. మీరు చేస్తేనేమో నీతి, మేము పని చేస్తే అవినీతి అన్న చందంగా మీ వ్యవహార తీరు ఉందన్నారు. సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును మరిచిపోతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల వేడుకకు సిద్ధమవుతోందని, ఈ క్రమంలో ఏప్రిల్ 27న లక్షలాది మందితో బహిరంగ సభ జరగబోతోందని అన్నారు. ఈ బహిరంగ సభకు భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు పార్టీ నాయకులు, క్యాడర్ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, కొల్లం జయప్రేమ్‌కుమార్, తుమ్మలపల్లి ధనేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల కోసం తపించిన యోధుడు

(5వ పేజీ తరువాయి)



నివాళులర్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులు

ఇల్లెందు క్రాస్ రోడ్డు ద్వారా రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం వరకు ర్యాలీ చేపట్టారు.

విద్యా పరిరక్షణ కమిటీ జాతీయ సభ్యుడు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ 75 ఏళ్ల పాటు దేశవ్యాప్తంగా కార్మికులు అనేక ఉద్యమాలు, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల చట్టాలను కేవలం మూడు లేబర్ కోడ్‌లను బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరించిందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల చేతిలోకి విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు వెళ్లటంతో వ్యవసాయ వ్యయం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

మాస్‌లైన్ సెక్రటరియేట్ సభ్యురాలు కె.రమ, సీనియర్ సంపాదకుడు సతీష్ చందర్ మనుస్మృతి మార్కెట్ సంస్కృతిపై ప్రసంగించారు. రాయల సుభాష్ చంద్రబోస్ ట్రస్ట్ చైర్మన్ గుర్రం అచ్చయ్య, మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేజీ రాంచందర్, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ట్రస్ట్ కార్యదర్శి పుసులూరి నరేందర్ మాట్లాడుతూ రవన్న జీవిత పోరాటాలను వివరించారు. నిజామాబాద్ నుంచి తూర్పు గోదావరి వరకు గిరిజన, మైదాన ప్రాంత ప్రజల హక్కుల కోసం పోరాడిన యోధుడు రవన్నగా కీర్తించారు. 1969లో డిగ్రీ విద్యాభ్యాసం వదిలేసి తుపాకి పట్టి, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం 50ఏళ్ల పాటు పోరాటాలు చేసి 2016 మార్చి 9న రవన్న మరణించారని పేర్కొన్నారు. అమరవీరులైన చంద్ర పుల్లారెడ్డి, రామనర్సయ్య, గడ్డం వెంకట్రామయ్య చూపిన బాటలో రవన్న పయనించి నూతన పోరాట ప్రజాపంథాకు బాటలు వేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, ముద్ద భిక్షం, చిన్న చంద్రన్న, హన్మేష్, ఎస్ఎల్ పద్మ, ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, రామయ్య, మనోహర్‌రాజు, కల్పన, నాయనిరాజు, రవి, ఆవుల అశోక్, బందెల వెంకన్న, కే అర్జున్‌రావు, ఆకుల వెంకన్న, మలీదు నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, కోట్లేటి నాగేశ్వరరావు, లాల్మియా, కే శ్రీను, గంట శ్రీను, శిరోమణి, మంగతాయి, అమర్లపుడి రాము, గోకినపల్లి ప్రభాకర్, జాటోత్ కృష్ణ, లలిత, ఝాన్సీ, శోభ, వెంకటేష్, రాకేష్, కే శ్రీను, ఆర్ శివలింగం, ఆజాద్ పాల్గొన్నారు. అరుణోదయ జిల్లా కార్యదర్శి గడ్డం లక్ష్మయ్య, రాఘవులు, ఆరేపల్లి వెంకన్న బృందంతో రవన్న ఉద్యమ గేయాలని ఆలపించారు.

తీన్‌మార్... పరేషాన్...

(5వ పేజీ తరువాయి)

ఆ నియోజకవర్గ కార్యక్రమాలకే హాజరవుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాల విషయంలో ఎక్కువ శాతం ఒక మంత్రితోనే కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. భట్టి, తుమ్మల తమ శాఖాపరమైన పనుల కార్యక్రమాలకు ఎమ్మెల్యేల ఆహ్వానం ఉంటేనే వెళుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాం నాయక్‌ల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వీరికి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో అనుసంధానంగా కార్యక్రమాలు ఉండకపోవడంతో హాజరు కాని పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో పైకి అంతా కాంగ్రెస్ పార్టీలో ఐక్యత అని చెబుతున్నా.. ఎమ్మెల్యేలకు మంత్రులకు మధ్య దూరం గణనీయంగా ఉంది. మంత్రులందరినీ కార్యక్రమాలకు ఆహ్వానిస్తే ఎలాంటి ఇబ్బందులు వస్తాయోననే ఆందోళన లోలోపల వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న పొదెం వీరయ్య రాష్ట్ర అటవీఅభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ పొదెంకు, ఎమ్మెల్యేలకు మధ్య కూడా అంతర్గత పోరు సాగుతోంది. భద్రాచలం నుంచి తనపై గెలిచిన తెల్లం వెంకటరావు కాంగ్రెస్‌లో చేరడంతో తన ప్రభావం ఆ నియోజకవర్గంలో తగ్గే పరిస్థితి ఉన్నందున పొదెం ఆయన రాకను వ్యతిరేకించారు. అయినప్పటికీ ప్రభుత్వ అవసరాల దృష్ట్యా కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నా ఇప్పటివరకు నియోజకవర్గంలోని నలుగురు ఎమ్మెల్యేలతో పాటు పార్లమెంట్ సభ్యులతో పార్టీ సమావేశాలు నిర్వహించలేని పరిస్థితి. ఎవరికివారే యమునా తీరు అన్నట్టుగా ఆ జిల్లాలో కాంగ్రెస్ వ్యవహారాలు సాగుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాత్రం మంత్రుల పర్యటనలో ఏదో ఒకచోట పాల్గొనడం, వారితో సంబంధాలు సాగిస్తున్నారు. సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో కూడా ఎమ్మెల్యేలతో సంబంధాలు సాగిస్తున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రభుత్వ పదవుల్లో ఉన్న నాయకులతో పాటు పార్టీకి చెందిన నియోజకవర్గస్థాయి నాయకులు గతంలో టికెట్లు ఆశించిన ఆశావహులు నామినేటెడ్ పదవులపై ఆసక్తి ఉన్న జిల్లా, నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు ముగ్గురు మంత్రులతో కలిసి తిరగలేని పరిస్థితి. ఎవరివైపు వెళితే మిగిలిన ఇద్దరు ఏమనుకుంటారోననే ఆందోళన కేడర్‌లో ఉంది. కొందరు రహస్యంగా కలిసి తమకు నియామక పదవుల్లో అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేసి వస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలు, నాయకుల పరిస్థితి.. 'కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం' అన్న చందాన ఉంది. ముగ్గురు మంత్రులు మూడు దారుల్లో ఉండడంతో ఏ దారిలో వెళ్లాలో తెలియక ఎమ్మెల్యేలు, కేడర్ అయోమయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఉమ్మడి జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కేడర్ మధ్య సమన్వయం పెంచే విషయంలో దృష్టి సారించడం లేదు.

నవమికి కూడా ఇంతేనా..?



గంగోలు సమీపాన ధ్వంసమైన రహదారి

అధ్వానంగా భద్రాచలం-చర్ల ఆర్‌అండ్‌బీ రహదారి

ఊసేలేని తూరుబాక కల్వర్టు నిర్మాణం

దుమ్ముగూడెం మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం-చర్ల ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై ప్రయాణ భద్రత కరువై నిత్యం ప్రమాదాలతో మరణ మృదంగం మోగుతోంది. ముఖ్యంగా భద్రాచలం నుంచి పర్ణశాల వరకు నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ స్టేట్ హైవే నిర్వాహణను పూర్తిగా గాలికొదిలేశారు. కొద్ది రోజులుగా ఈ రహదారిపై వాహన ప్రమాదాలు పెరగగా, కారణాలు విశ్లేషించి అరికట్టే పరిస్థితి కనబడడం లేదు. పర్ణశాల రామాలయానికి నిత్యం వందలాది వాహనాల్లో యాత్రికుల రాకపోకలు కొనసాగుతోండగా, గడచిన ముక్కోటికు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వచ్చే ఏప్రిల్‌లో శ్రీరామనవమి సందర్భంగా వివిధ జిల్లాల నుంచి పర్ణశాలకు వచ్చే భక్తులకు మరోమారు తిప్పలు తప్పేట్లు లేవు. గతంలో ముక్కోటి, నవమి సందర్భంగా ఈ రహదారిపై చిన్నపాటి మరమత్తులు అవసరమైనా ఆర్‌అండ్‌బీ శాఖ యుద్ధ ప్రాతిపదికన చేపట్టేది. ఇప్పుడు రహదారి పూర్తి అధ్వానంగా మారినా, కనీసం అటువైపు తొంగి చూసే పరిస్థితి లేదు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారి

భద్రాచలం-పర్ణశాలల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. తూరుబాక నుంచి పర్ణశాల వరకు రోడ్డుపై పలుచోట్ల పెచ్చులుగా లేచి పోయింది. రహదారి మధ్య నుంచి ఓ వైపు సగభాగం పూర్తిగా గుంతలమయంగా మారింది. నునుపుగా ఉండే సగ భాగంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు రెండూ ఒకే ప్రక్క ప్రయాణిస్తూ ఢీ కొంటున్నాయి. ఈ మధ్య కాలంలో జరిగిన ప్రమాదాలన్నీ ఇటువంటివే. భద్రాచలం-పర్ణశాలల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిపై చివరిగా 2010లో బీటీ వేయగా, మూడేళ్ల క్రితం ఓసారి సింగిల్ కోటింగ్ వేశారు. కాగా చివరిగా వేసిన సింగల్ కోటింగ్ పనులు నాసిరకంగా ఉండడంతో త్వరిత గతిన రోడ్డు ధ్వంసమైందనే ఆరోపణలున్నాయి.

ఇసుక లారీలతో రహదారి విధ్వంసం

చర్ల-భద్రాచలం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి విధ్వంసానికి ప్రధాన కారణం ఇసుక లారీలనేది జగమెరిగిన సత్యం. రహదారి నిబంధనలకు విరుద్ధంగా అరవై నుంచి డెబ్బై టన్నుల వరకు ఇసుక లోడుతో లారీలు ప్రయాణిస్తుండడంతో రహదారి పూర్తిగా ధ్వంసమౌతోంది. నిలువరించాల్సిన సంబంధిత శాఖల అధికారులకు ముడుపులు ముట్టడంతో లారీలను తనిఖీలు చేయడం లేదనే ఆరోపణలు వినబడుతున్నాయి. ప్రస్తుత వాహన ప్రయాణాల సంఖ్య ఆధారంగా స్టేట్ హైవే పరిధిలో ఉన్న భద్రాచలం-చర్ల ఆర్‌అండ్‌బీ రహదారిను నేషనల్ హైవే ప్రమాణాలతో నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఊసేలేని తూరుబాక కల్వర్టు నిర్మాణం

భారీ వర్షాలకు గతేడాది సెప్టెంబరులో కుంగిపోయిన తూరుబాక కల్వర్టు నిర్మాణం ఊసేలేకుండా పోయింది. డైవర్షన్ వేసి చేతులు దులుపుకున్న ఆర్‌అండ్‌బీ శాఖ, నూతన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. భద్రాచలం-చర్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఎంతో కీలకమైన తూరుబాక కల్వర్టు నిర్మాణానికి సుమారు రూకోటిల అంచనా వ్యయంతో సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.

కాగా ఇప్పటికే మూడుసార్లు ప్రతిపాదనలు వెళ్లినప్పటికీ, నిధుల మంజూరు జరగలేదని సమాచారం. ఈ ఏడాది వర్షాకాలం వస్తే డైవర్షన్ రహదారి నిలబడే పరిస్థితి కనబడడం లేదు. దీంతో భద్రాచలం-చర్లల మధ్య రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం కనబడుతోంది. తెలంగాణా-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్ని కలిపే ఏజన్సీలో కీలకమైన భద్రాచలం-చర్ల ఆర్‌అండ్‌బీ రహదారి నిర్వాహణ పట్ల ఆర్‌అండ్‌బీ శాఖ దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈ విషయమై డీఈ హరిలాల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

ధ్యాన మందిరాన్ని సందర్శించిన జడ్జి



పూజలు చేస్తున్న న్యాయాధికారి రాజగోపాల్

నేలకొండపల్లి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఆదివారం నేలకొండపల్లిలోని చారిత్రాక కట్టడాలను సతీ సమేతంగా సందర్శించారు. తొలుత భక్తరామదాసు నడయాడిన ధ్యాన మందిరాన్ని సందర్శించారు. జిల్లా జడ్జికి అర్చకుడు రమేష్ సాదర స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు వితరణ చేసారు. రామదాసు చరిత్రను న్యాయాధికారికి వివరించారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని అతి ప్రాచీనమైన శ్రీవైద్యనాధస్వామి దేవాలయాన్ని సందర్శించారు. అర్చకుడు దివాకర్ ప్రత్యేక పూజలు చేసి న్యాయాధికారి కుటుంబానికి తీర్థప్రసాదాలను అందచేసారు. అనంతరం దక్షిణ భారత దేశంలోనే అతి పెద్దదిగా ప్రసిద్ది గాంచిన బౌద్ధస్థూపాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ నేలకొండపల్లిలోని అతి ప్రాచీన, చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించటం సంతోషంగా ఉందన్నారు.

ప్రతిభ ఆధారంగా నియామకాలు



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

కొత్తగూడెం టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామకాలు చేపట్టడం జరుగుతుందని, దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని రిక్రూట్మెంట్ జనరల్ మేనేజర్ బెనటిక్ నికోలస్ అన్నారు. ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ, పిజి కళాశాలలో సింగరేణి సంస్థలో జూనియర్ మైనింగ్(ఈ1-గ్రేడ్) జూనియర్ ఆఫీసర్(ఆఫీస్‌అడ్మినిస్ట్రేషన్ ఈ1-గ్రేడ్), జూనియర్ సర్వే ఆఫీసర్(ఈ1-గ్రేడ్) పోస్టుల భర్తీకై రాత పరీక్షలను నిర్వహించారు. ఈ మూడు విభాగాలకు గాను 89 మంది అభ్యర్థులు పరీక్షలకు హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి అభ్యర్థులు డబ్బులు ఇచ్చి నష్టపోవద్దన్నారు. పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్‌సైట్, సింగరేణి కార్యలయ ప్రధాన ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డు ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఈఅండ్‌ఎం) విజిలెన్స్ కె.ప్రసాదరావు పాల్గొన్నారు.

కోర్టుకు వచ్చే వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

హైకోర్టు న్యాయమూర్తి నందా సూరేపల్లి



వెయిటింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి నందా

కొత్తగూడెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): న్యాయసేవలు ప్రజలకు మరింత చేరువ కావడానికి మౌలిక సదుపాయాల అభివృద్ధి కల్పన ఎంతో అవసరమని, న్యాయవ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వ న్యాయసేవల సంస్థల భాగస్వామ్యం ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉందని హైకోర్టు న్యాయమూర్తి నందా సూరేపల్లి అన్నారు. భద్రాది కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన వెయిటింగ్ హాల్స్‌ను ఆదివారం న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కోర్టుకు విచారణ నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించడానికి, న్యాయసేవలకు మరింత వృద్ధి కలిగించేందుకు ఈ హాల్స్ ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. న్యాయ సేవలను అందుబాటులోకి తేవడంలో, లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంలో న్యాయవాదులు కీలక పాతంర పోషిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఆర్బిట్రేషన్, మీడియేషన్, కన్సిలియేషన్ కేంద్రాల ఏర్పాటు వల్ల న్యాయవ్యవస్థపై భారం తగ్గి కేసుల విచారణ వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. న్యాయ పరమైన వివాదాలను కోర్టు వెలుపల పరిష్కరించేందుకు ఈ విధానాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, ప్రజలు వీటిని ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ నేతృత్వంలో న్యాయవాదుల బృందం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రదాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి కార్యదర్శి జి.భానుమతి, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జీ బత్తుల రామారావు, రెండోవ అదనపు జూనియర్ సివిల్ జడ్జీ కె.సాయిశ్రీ, భద్రాచలం మణుగూరు, దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జీలు శివనాయక్, కె.సూరిరెడ్డి, డాక్టర్ బి.భవాని తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో న్యాయమూర్తి

రామయ్యను దర్శించుకున్న న్యాయమూర్తి

భద్రాచలం: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎస్పీ విక్రాంత్ కుమార్‌సింగ్, భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రామయ్య దర్శనం అనంతరం భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి నందా సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి, న్యాయవాదులతో మాట్లాడారు. అనంతరం న్యాయస్థానం ప్రాంగణంలో మొక్కను నాటారు. కాగా భద్రాచలం కేంద్రంగా అదనపు సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ తరపున వినతిపత్రం సమర్పించగా ఇందుకు సానుకూలంగా స్పందించిన న్యాయమూర్తి వారం రోజుల్లో తగు నిర్ణయం తీసుకుంటామని స్థానిక న్యాయవాదులకు హామీ ఇచ్చినట్లు భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం తెలిపారు.

ఉనికిని చాటుకునేందుకే మావోల దుశ్చర్యలు: ఎస్పీ

కొత్తగూడెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాలలో నివసించే ఆదివాసీ ప్రజలను నిషేదిత మావోయిస్టులు భయభ్రాంతుకు గురిచేయటం హేయమైన చర్య అని, తమ మనుగడ కోసమే వారు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ ప్రజలు తమ జీవనం కొనసాగించడానికి నిత్యం సంచరించే ప్రదేశాలలో మందు పాతరలను అమర్చుతూ వారు ప్రాణాలు కోల్పోయే విధంగా మూర్ఖపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన కుంజం పాండే తన సోదరితో కలసి ఉట్లపల్లి అటవీ ప్రాంతంలో కట్టెల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి తీవ్ర గాయాలపాలై తన కుడి కాలు కోల్పోడం జరిగిందని, సంఘటన జరిగిన వెంటనే సమాచారం తెలుసుకున్న చర్ల పోలీసులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించడం జరిగిందని తెలిపారు. అమాయకపు ఆదివాసీ ప్రజల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న మావోయిస్టుల తీరును ఎస్పీ తీవ్రంగా ఖండించారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని భావించి ఇలాంటి ఆకృత్యాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు విద్యా, వైద్యం, రవాణా వంటి సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పోలీస్‌శాఖ కృషి చేస్తుంటే, అభివృద్ధి నిరోధకులుగా మారి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే చర్యలకు పాల్పడుతున్నారని ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు.

భగవద్గీత పఠనం మేథాశక్తిని పెంపొందిస్తుంది

» కలెక్టర్ జితేష్ వి.పాటిల్



బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్

కొత్తగూడెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మేథాశక్తిని పెంపొందించుకునేందుకు భగవద్గీత పఠనం ఎంతో దోహద పడుతుందని, ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే భగవద్గీతను చదవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆదివారం కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలలో ఇస్కాన్ హరేరామ హరే కృష్ణ జుహు మందిరం (బొంబాయి), కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో వాల్యూఎడ్యుకేషన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి భగద్గీత ఒక దిక్సూచి లాంటిదని, జీవన విధానంలో వచ్చే ఆటు పోట్లను సమర్థవంతంగా ఎదుర్కొనే మార్గదర్శిగా భగద్గీత గ్రంథం ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులు చిన్న తనం నుంచి భగద్గీత పఠనం చేస్తే క్రమశిక్షణ, పట్టుదల అలవడుతుందన్నారు. భగద్గీత, ఇతరత్రా అంశాల్లో ఇస్కాన్ వారు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ పోత్సాహక బహుతులు, జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో జుహు టెంపుల్ బాధ్యులు నర్సింహ పూజాదాస్, శ్రవన్ కుమార్, కొత్తగూడెం ఇస్కాన్ సభ్యులు గుమలాపురం రమేష్, శ్రీలత, రమాదేవి, సౌజన్య, ప్రకాశ్‌ప్రభు, ఆర్కిడ్ స్కూల్ ప్రిన్సిపాల్, శ్రీదేవి, కరస్పాండెంట్ సాగర్, డీఎస్ఆర్, టైడ్ టీచర్ హరిత, రూప పాల్గొన్నారు.

సామాజిక సమానత్వంపై ఉద్యమించాలి

ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ



మాట్లాడుతున్న మంగ

భద్రాచలం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక, రాజకీయ ఆర్థిక సమానత్వంపై మహిళలు ఉద్యమించాలని ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ పిలుపునిచ్చారు. భద్రాచలంలో పీవోడబ్ల్యు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా భద్రాచలంలో ఆదివారం జరిగిన సమావేశంలో పీవోడబ్ల్యు జిల్లా నాయకురాలు కప్పల సూర్యకాంతం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంగ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఒక వేడుక కాదని దాని వెనుక ఒక కన్నీటి చరిత్ర ఉందన్నారు. నేడు అనేక చట్టాలు వచ్చినప్పటికీ ఇంకా శ్రమ దోపిడీ జరుగుతుందని పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని వారన్నారు. పని ప్రదేశాలలో నేటికీ మహిళలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. పని ప్రదేశాలలో ఇప్పటికీ లైంగిక వేధింపులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. మహిళలు ఎంత ఉన్నత చదువులు చదివినా పురుషుల వద్ద చిన్న చూపునకు గురవుతున్నారని అన్నారు. ఈ విధానం రూపుమాపాలని కోరారు. పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని అన్నారు. ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారికి పోటీనివ్వాలని కోరారు. సామాజిక, రాజకీయ ఆర్థిక సమానత్వంపై మహిళల పోరాటాలు చేయాలని కోరారు. గౌని నాగేశ్వరరావు, ముసలి సతీష్, సున్నం భూలక్ష్మి, జక్కం కొండలరావు పాల్గొన్నారు.

మార్కెట్ ఉద్యోగులకు..

అండగా ఉంటాం

ఏఎంసీ చైర్మన్ యరగర్ల, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



విశ్రాంత ఉద్యోగిని సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం మార్కెట్ ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మార్కెట్ ఉద్యోగు లకు, పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రిటైర్డ్ మార్కెట్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ ప్రభుత్వం కొనసాగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. పెన్షనర్స్‌కు రావాల్సిన డీఏ, ఇతర బెనిఫిట్స్‌ను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్బంగా మార్కెట్‌లో సుదీర్ఘకాలం సేవలు చేసిన విశ్రాంత ఉద్యోగులను వారు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి, కార్యదర్శి శంకర్ లింగం, టీఎస్‌జీవో జిల్లా నాయకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, తాడేపల్లి కిరణ్‌కుమార్, పోలవరపు వీరాంజనేయులు, పెన్షనర్ల సంఘం బాధ్యులు కనపర్తి బాబు, పుల్లయ్య, జెల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

మున్నేరులో పడి వ్యక్తి మృతి

ఖమ్మం రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మున్నేరులో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, గోళ్లపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాది కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, మొగళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎర్రం వెంకటేష్ కుమారుడు ఎర్రం మహేష్ (22) ఖమ్మంలోని గట్టయ్య సెంటర్‌లో రూమ్‌లో ఉంటూ ఓ కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శనివారం రోజు మహేష్ తన స్నేహితులు సనత్ కుమార్, అరవింద్, సురేష్, వీరందరు కలిసి రూమ్ నుండి ఖమ్మం రూరల్ మండలం, గోళ్ళపాడు వద్ద చేపముక్కలతో కల్లు తాగేందుకు వెళ్లారు. గోళ్లపాడు మున్నేరు కట్టువద్దకు వెల్లి కల్లుతాగారు. మహేష్ బహిర్భూమికి వెళాతానని చెప్పి వెళ్లి నీటిలో పడిపోయాడని మహేష్ తండ్రి వెంకటేష్‌కు స్నేహితులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే వెంకటేష్ భద్రాచలం నుంచి వచ్చి గజ ఈతగాళ్లతో నీటిలో వెతికినా మహేష్ ఆచూకి లభ్యం కాలేదు. ఆదివారం కట్టు నీటిలో మహేష్ మృతదేహం లభ్యం అయింది. అన్నం శ్రీనివాస్ బృందం మృతదేహన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మహేష్ తండ్రి వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

కారు ఢీ కొని వ్యక్తి..

రోడ్డు వెంట నడుచుకుంటు వెళుతున్న వ్యక్తిని వెనుకనుండి అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, బారుగూడెం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓడిస్సా రాష్ట్రంకు చెందిన ఘరమణి కంద భర్త శుక్రు కంద (50) కుటుంబ సభ్యులు రూరల్ మండలం, బారుగూడెం పరిధిలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తుంటారు. శనివారం రాత్రి శుక్రు కంద కిరాణం షాపునకు వెళ్లి సరుకులు తీసుకుని నడుచుకుంటు వెళుతుండగా వరంగల్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు వెనుకనుండి వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శుక్రు కందను స్థానికులు 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు శుక్రు కంద ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య ఘరమణి కంద ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

టేకులపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాధంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తుమ్మలచెలక స్టేజి సమీపంలో ఆదివారం జరిగింది. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం కారెపల్లి మండలం ఉసిరికాయలపల్లికి చెందిన జోగ వంశీ(22), పొడుగు ప్రవీన్‌లు ఆదివారం మోటారుసైకిల్‌పై మండలంలోని తుమ్మలచెలకలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. మోటారుసైకిల్‌పై తిరిగి ఇంటికి ఉసిరికాయలపల్లి వెళుతున్న క్రమంలో టేకులపల్లి-బోడు రహదారిపై మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం సమీపంలో గల మూలమలుపువద్ద మోటారుసైకిల్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వంశీ మృతి చెందాడు, తీవ్రగాయాలైన ప్రవీన్‌ను కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. టేకులపల్లి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కల్లూరులో వ్యక్తి మృతి

కల్లూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని తిరువూరు మండలం కోకిలంపాడు గ్రామానికి చెందిన ఎక్కిరాల సురేష్ (40) తన ద్విచక్రవాహనంపై మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామం నుంచి తన స్వగ్రామానికి శనివారం రాత్రి పది గంటల సమయంలో పల్సర్ ద్విచక్రవాహనంపై తిరిగి వెళుతుండగా స్థానిక షుగర్ ఫ్యాక్టరీ వద్ద ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా తలకు తీవ్రగాయమై సురేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని తమ్ముడు ఇచ్చిన పిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిత తెలిపారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలు..

ఖమ్మం క్రైం మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వృద్ధురాలు మృతిచెందిన సంఘటన ఆదివారం ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని మమతారోడ్డు సమీప ప్రాంతానికి చెందిన మొగిలి సుక్కమ్మ(70) మతిస్థిమితం సరిగాలేక ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం మధ్యాహ్నం నగరంలోని లకారం పార్కు పక్కన ఉన్న ఓ వెంచర్‌లో ఓ వృద్ధురాలి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉన్నదని స్థానికులు గమనించి వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వన్ టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ సంఘటనాస్థలం వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మొగిలి సుక్కమ్మ మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందిచారు. తర్వాత అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మధిరటౌన్,మార్చి9(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని వైరా నది సమీపంలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను మధిర టౌన్ ఎస్‌హెచ్‌ఓ, ట్రైనీ ఐపిఎస్ కొట్టె రుత్విక్‌సాయి, ఎస్ఐ చంద్రశేఖర్‌లు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ 2750 నగదు ఐదు సెల్‌ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

ఖమ్మం క్రైం మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురు వ్యక్తులపై ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసునమోదైంది. నగరంలోని పొదిలి లక్ష్మీనగర్ సమీపంలోని ఎన్నెస్పీ కాలువ కట్ట పక్కన ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం రావటంతో పోలీసులు దాడులు నిర్వహించారు. దీంతో నగరానికి చెందిన ఆరుగురు పట్టుబడ్డారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.17,090నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఖానాపురంహవేలి పోలీసులు తెలిపారు.

చోరీపై కేసు నమోదు

దుమ్ముగూడెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఈనెల 6న జరిగిన చోరీపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కిరాణా దుకాణం నిర్వహిస్తున్న బెజ్జంకి వీరభద్రాచారి తన కుటుంబంతో కలిసి ఈనెల 6న బంధువుల వివాహానికి జూలూరుపాడు కుటుంబంతో కలిసి వెళ్లాడు. పెళ్లికి వెళ్లి ఈ నెల 8వతేదీ రాత్రి తిరిగి ఇంటికి రాగా ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలోని ఆరు గ్రాముల బంగారం, పది తులాల వెండి, రూ10 వేల నగదు, మద్యం బాటిళ్లు దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఎస్ఐ వెంకటప్పయ్య కేసు నమోదు చేశారు.

భద్రాద్రి మహిళలకు సన్మానం

భద్రాచలం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన ఏడుగురు మహిళలను ఏపీలోని విజయవాడలో ఉన్న సాహితీ సాంస్కృతిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శనివారం రాత్రి అంతర్జాయ మహిళ దినోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయురాలు మరిగంటి పద్మావతి, మార్కెట్ యార్డులో పని చేస్తున్న కవయిత్రి కత్తి కనకదుర్గ, సింగర్ వాణీరామ్, ఉపాధ్యాయులు జె.నాగలక్ష్మి, దుర్గాకోమలి, ఎర్రంశెట్టి పూర్ణిమలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో కత్తిమండ ప్రతాప్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన మహిళలు



ఆ ప్రచారం అవాస్తవం: ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రిన్సిపాల్

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో హోలీ వేడుకల కార్యక్రమం జరుగుతుందని ప్రచారం చేస్తున్నారని, అటువంటి ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికి ఎటువంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. కొందరు పలు కార్యాక్రమాలకు సంభందించి టికెట్లు అమ్ముకున్నట్లు ప్రచార పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిని కళాశాల ఖండిస్తుందని తెలిపారు. ఏ కార్యక్రమం అయినా పరిశీలించిన అనంతరం పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలనే నింబంధన ఉంటుందని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

» కూసుమంచి తహసీల్దార్ కరుణ
» ఘనంగా మహిళా దినోత్సవం


మాట్లాడుతున్న కూసుమంచి తహసీల్దార్ కరుణ

నేలకొండపల్లి, మార్చి9(ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని కూసుమంచి తహసీల్దార్ కరుణ అన్నారు. ఆదివారం నేలకొండపల్లి వాసవీభవన్‌లో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, సేవా మహిళా మండలి సంయుక్తంగా నిర్వహించిన మహిళా దినోత్సవంలో మాట్లాడారు. సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరుణ మాట్లాడుతూ మహిళలు దాదాపుగా అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నప్పటికీ అక్కడక్కడావివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, వ్యాపారవేత్తలుగా ఎదగాలని అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పరంజ్యోతి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో గౌరవించబడాలన్నారు. మహిళలను పూర్తిగా గౌరవించే సమాజం కావాలని, మహిళలపై అత్యాచారాలను కఠినంగా అణిచివేయాలన్నారు. తొలుత మహిళలకు పాటలు, ఆటల పోటీలు నిర్వహించారు. సంవత్సరం లోపు చిన్నారులకు వెల్‌బేబీషో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు, మహిళా దినోత్సవ క్యాంపు చైర్మన్ మచ్చా రేణుక, కో-చైర్మన్ కొంగర ప్రభావతి, న్యాయవాది కన్నాంబ, సొసైటీ మాజీ అధ్యక్షులు పొన్నగాని శ్రీనివాస్, యలమద్ది లెనిన్, మచ్చా రఘుపతి, గెల్లా జగన్మోహన్‌రావు, భాస్కరరావు, కార్యదర్శి గెల్లా వెంకటరమణ గుప్తా, కోశాధికారి దండా రవీంద్రబాబు,ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి, ఈసీ సభ్యులు భవనాశి దుర్గారావు, పచ్చా తిరుపతయ్య, గరిణె వెంకటేశ్వర్లు, చావా గణపతిరావు, ఓరుగంటి నారాయణరావు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఖమ్మంఖానాపురంహవేలి: సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుదని పౌరసమితి అధ్యక్షుడు పులిపాటిప్రసాద్ అన్నారు. ఆదివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో మహిళ దినోత్సవం సందర్భంగా పౌరసమితి ఆధ్వర్యంలో 18మంది మహిళలకు శ్రీశక్తిఅవార్డులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో పౌరసమితి సభ్యులు షేక్‌ఖాసీమ్, వరప్రసాద్, బొగ్గవరపు సతీస్, పసుమర్తి శ్రీనివాస్, శ్రీకాంత్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే క్లీన్ ఖమ్మం

» పుణెలో వ్యర్థాల సేకరణలో విభజన
» ఏరోజు కారోజే ఎరువు తయారీ
» డంపింగ్ లేని పారిశుధ్యానికి బాటలు
» ప్రజలకు అవగాహన కల్పించటంతో తొలి అడుగులు


పుణెలో విడివిడిగా చెత్త అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి9(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ, వినియోగంలో ఖమ్మం కంటే పుణె నగరంలో ముందుచుపుతో నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఆ నగరం క్లీన్‌గా ఉంటోంది. ఖమ్మం నగరంలోని 60 డివిజన్లలోని చెత్తను తీసుకెళ్లి కేఎంసీ పారిశుధ్య విభాగం ఒకే ప్రాంతంలో డంపింగ్ చేస్తున్నారు. దీంతో మూడు డివిజన్‌ల ప్రజలు దుర్వాసనతో అనారోగ్యానికి గురవున్నారు. డంపింగ్‌కు చెత్తను తరలించేందుకు 100కు పైగా వాహనాలను వినియోగంలో ఉండటంతో కేఎంసీ ఆదాయానికి భారీగా వ్యయం పెరుగుతుంది. తర్వాత బయో మైనింగ్ పేరుతో శుద్ధి చేయాలంటూ మరో వ్యయం జరుగుతుంది. ఇలా కేఎంసీ ఆదాయంలో సగానికి పైగా పారిశుధ్య చెత్త నిర్వహణకే ఖర్చు జరుగుతుంది.

పుణెలో చేసిది ఇలా..

పుణెలో 45లక్షల జనాభా ఉంది. రోజుకు 1,700 మెట్రిక్ టన్నుల చెత్తబయటకు వస్తోంది. కానీ డంపింగ్ యార్డు మాత్రం లేదు. ఎందుకంటే ఏరోజు చెత్త ఆదే రోజు శుద్ధి జరుగుతుంది. ఇంటింటి చెత్త సేకరణ నుంచి శుద్ధి వరకు తడి, పొడి, ప్లాస్టిక్, హానిక వ్యర్థాలను విడివిడిగా సేకరిస్తున్నారు. ఆయా వ్యర్థాలను బయోమైనింగ్, బయోగ్యాస్, సేంద్రియ ఎరువులు, పేపరు తయారికి ముడి పదార్థాలుగా వాడుతున్నారు. పుణె మున్సిపల్‌శాఖకు ఆర్థిక వ్యయం లేకుండానే స్వచ్ఛ సహకార సంఘాలకు, మహిళా స్వయంసంఘాలు నిర్వాహణచేపడుతున్నాయి.ఇంటింటి యూజర్ చార్జీలతో పాటుగా వ్యర్థాలను శుద్ధి కేంద్రాలకు తరలింపు ద్వారా రెండువిధాలుగా మహిళ స్వయం సహాయక సంఘాలకు ఆదాయ వస్తోంది.

అవగాహన తోనే క్లీన్ ఖమ్మం

పుణె మున్సిపాలిటీలో ఇంటి ముందుకు వచ్చే చెత్త సేకరణ వాహనంలో చెత్తను విడి విడిగా అందిస్తారు. ఐదేళ్ల పిల్లల నుంచి 90ఏళ్ల వృద్ధుల వరకు మంచి అవగాహనతో ఉంటారు. చెత్త బండిలో తడి, పొడి, ప్లాస్టిక్, హానికర చెత్తలను విడివిడిగా ఉన్న డబ్బాల్లో వేస్తున్నారు. కానీ ఖమ్మం నగరంలో మాత్రం ప్రజలు తడి పొడి చెత్తను ఒకే డబ్బాల్లో పారిశుధ్య వాహనాలకు అందిస్తున్నారు. కొంత మంది విడి,విడిగా తడిపొడి చెత్తను పారిశుధ్య వాహనాలకు అందించినా.. కార్మికులు మాత్రం కలిపేసి డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నారు. దీంతో ఇక్కడే ప్రధానమైన సమస్య ఏర్పడుతుంది. ప్రజలు అవగాహన పెంచుకొని విడి విడిగా చెత్తను ఏర్పాటు చేయటంతో పాటుగా కేఎంసీ అధికారులు కూడా తడి,పొడి, ప్లాస్టిక్, హాని కరమైన వ్యర్థాలను విడి విడిగా సేకరించి వాటిని ఏరోజు కారోజు శుద్ధి చేయించటం ద్వారానే క్లీన్ ఖమ్మంగా ఖ్యాతి పొందుతుంది.

శ్రుతిమించిన 'హాస్టల్ డే' వేడుకలు



ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఆదివారం ఖమ్మం ఎస్సీ బాలుర(బీ) వసతిగృహంలో హాస్టల్‌డే కార్యక్రమం శ్రుతిమించింది. త్వరలో పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు బల్లలపై ఎక్కి డ్యాన్సులు వేయటం కొంత ప్రమాదాన్ని తలపించింది. పర్యవేక్షణ లేనికారణంగా ఈ పరిస్థితి నెలకొంది. అనుకోని సంఘటన జరిగితే ఫలితాలు తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈకార్యక్రమానికి టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సాంఘీకసంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ హాజరయ్యారు. ఆదివారం ఖమ్మం ఎస్సీ బాలుర(బీ)వసతిగృహంలో హాస్టల్‌డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు చదువుకోవాలని హితవు పలికారు. టీఎన్జీవోస్ జిల్లాఅధ్యక్షకార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన(బుల్లెట్) శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీకాంత్, ప్రముఖవక్త అట్లూరి వెంకటరమణ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరంలో 150మందికి పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు అనుదీప్

నేలకొండపల్లి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ఆదివారం నేలకొండపల్లి రావెళ్లభవన్‌లో నూతక్కి గంగాధరరావు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నెలనెలా ఉచిత వైద్య శిబిరం పూర్తిగా విజయవంతమైంది. ఈ శిబిరంలో షుగర్, బీపీలతో పాటుగా సాధారణ జబ్బులకు పరీక్షలు నిర్వహించారు. నెలకు సరిపడా మందులను కేవలం రూ.100లకే అందించారు.150మందికి షుగర్, బీపీలను పరీక్షించారు. 39మందికి ఓ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కొల్లి. అనుదీప్, డాక్టర్ కురెల్లి పవన్‌కల్యాణ్ వైద్య సేవలను అందించారు. ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, మంకెనపల్లి నర్సింహారావు, షేక్.అబ్దుల్, షేక్.అబ్దుల్‌రహీం, సామాల మల్లికార్జునరావు, షేక్.జమాల్‌పాషా, ఏలూరి కోదండరామారావులు వాలంటీర్లుగా సేవలందించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యసేవలు

ఖమ్మంఖానాపురంహవేలి: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచిత ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. యశోద ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు కీర్తి 96మందికి ఉచిత పరీక్షలు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ రాఘవరెడ్డి, బొల్లింకొండ శ్రీనివాసరావు, గెల్లా శ్రీరామ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం కమిటీ నియామకం

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుడిసె సాల్మన్‌బాబును నియమిస్తూ ఆసంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ ఆదివారం నియామకపత్రం అందించారు. అంబేద్కర్ ఆశయసాధనే లక్ష్యంగా సమాజ చైతన్యం,నవసమాజ నిర్మాణం కోసం కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీవ్‌రాజ్, దామల్ల సత్యం, కొప్పుల రామారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్వేచ్ఛ నాటిక

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి9 (ఆంధ్రజ్యోతి): నెలనెల వెన్నెల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భక్తరామదాసు కల్యాణ మండపంలో నిర్వహించిన స్వేచ్ఛ నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైద్రాబాద్ వారి ప్రదర్శించిన ఆ నాటికలో బియం రెడ్డి దర్శకత్వం వహించారు. అనంతరం నటరాజ నాట్యనికేతన్ ఆచార్య మాధవరావు ఆధ్వర్యంలో ప్రనవిక నాట్యం , అభినయ రుద్రనాట్యాలయం గురువు ఫణీల్ కణతాల శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వెదురు డిపో ద్వారా ప్రభుత్వానికి ఆదాయం

ఏన్కూరు, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు వెదురుడిపో ద్వారా ప్రతిఏడాది ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఈఏడాది ఆదాయ లక్ష్యం రూ.5లక్షలుగా నిర్ణయించినట్లు అటవీశాఖ అధికారుల తెలిపారు. జిల్లాల పునర్విభజన తర్వాత ఇక్కడ డిపో ఏర్పాటు చేశారు. కనకగిరి గుట్టల నుంచి నాణ్యమైన వెదురును సేకరిస్తారు. నైపుణ్యం గల కూలీలు లేకపోవడంతో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలతో వీటిని నరికించి లారీల ద్వారా డిపోకు తరలిస్తారు. లాట్లు ఏర్పాటుచేసి ప్రతి నెల 6,21 తేదీల్లో బహిరంగ వేలం పాట ద్వారా విక్రయిస్తారు. డిసెంబరు నుంచి మార్చి నెలవరకు డిపో నిర్వహిస్తారు. ఏపీ,తెలంగాణ రాష్ట్రాల్లోని గుంటూరు, విజయవాడ, హైదరాబాదు, కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల నుంచి ఇక్కడికి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ఖమ్మంస్పోర్ట్స్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కర్నాటి వీరభద్రం, సెక్రెటరీగా వింజనంపాటి చంద్రశేఖర్, ట్రెజరర్‌గా జట్ల శ్రీనివాసరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కమర్తపు మురళి, వైస్ ప్రెసిడెంట్లుగా బాలసాని ఆనంద్, దుద్దుకూరి సత్యనారాయణ, కొంగర శ్రీనివాస్,రేగళ్ళ శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా చావా వెంకటేశ్వరరావు, కొల్లి రమేష్, రవిబాబు, రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతేకాకుండా ఈసీ మెంబర్లుగా మందడపు అనిల్, సాయిక్రిష్ణ, నాగేశ్వరరావు, పాపారావు, శేఖర్, నవీన్‌రెడ్డి, క్రిష్ణారెడ్డిలను ఎన్నుకున్నారు. ఎన్నికను రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఏసీపీ ఘంటా వెంకట్రావు సమక్షంలో ఎన్నుకున్నారు. నూతన కమిటీ నాలుగేళ్ల పాటు క్రీడా సంఘానికి సేవలందించనుంది. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్స్ రవిమారుత్, యుగంధర్, సిరిపురపు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యోత్సవ్ ఫెస్టివల్‌లో సుభాషిణి



ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ డిల్లీలో రవీంద్రభవన్‌లో ఆదివారం నిర్వహించిన సాహిత్యోత్సవ్ పోయెట్రి ఫెస్టివల్‌లో ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ కవయిత్రి తోట సుభాషిణి పాల్గొన్నారు. అస్సామి, కన్నడ, మరాఠి తదితర బాషల కవులతో కలిసి ఆమె హిందీ, ఇంగ్లీష్ భాషల కవితలను చదివారు. కొదుమూరు ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆమె కవిత్వంలో రాణిస్తున్నారు. అనేక వర్తమాన, సమకాలీన అంశాలపై పలు కవితా సంకలనాలను వెలువరించారు. ఖమ్మం జిల్లా తరుపున డిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సుభాషిణిని పలువురు కవులు, సాహితీవేత్తలు అభినందించారు.

కనులపండువగా ప్రతిష్ఠా మహోత్సవం



సత్తుపల్లిరూరల్,మార్చి9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం కన్నులపండువగా సాగింది. ప్రతిష్ఠాచార్యులు శ్రీమాన్ ప్రతాపురం గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి సేవా ట్రస్ట్ నిర్వహకులు ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠకు హాజరైన సుమారు 15వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం, అన్నమాచార్య సంకీర్తన జరిపించారు.

కృత్రిమ మేధ విద్యావ్యవస్థకు అవసరం

సీబీఐ రిటైర్డ్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ


జ్యోతిప్రజ్వల చేస్తున్న లక్ష్మీనారాయణ, కళాశాల చైర్మన్ శ్రీధర్

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి9(ఆంధ్రజ్యోతి): కృత్రిమమేధ నేటివిద్యావ్యవస్థకి, సమాజానికి దోహదపడుతుందని సీబీఐ రిటైర్డ్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫ్యూచరిస్టిక్ గ్లోబల్ ఎడ్యుకేషన్ బియాండ్ బౌండరీస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలతో కలిసి జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్నిప్రారంభించారు.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సీబీఎస్ఈ, కేంబ్రిడ్జ్ గ్లోబల్ ఎక్స్పోజర్ కోసం ఏర్పాటు చేసిన శ్రీచైతన్య గ్లోబల్ క్యాంపస్ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ సాయిగీతిక, విద్యాసంస్థల ఏజీఎంలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

వేంసూరుకు చేరిన గోదావరి జలాలు

వేంసూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): సీతారామప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు వేంసూరు చేరడంతో ఆదివారం ఎన్టీఆర్ కెనాల్ వద్ద కాంగ్రెస్ నాయకులు, రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ జల పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోదావరి జలాలు వేంసూరుకు రావడంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, సోమిరెడ్డి, ఎండి ఫైజుద్దిన్, తుమ్మూరు రామిరెడ్డి అట్లూరి సత్యనారాయణరెడ్డి, ఎర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు 'ఎమ్మెల్సీ' కేటాయించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి9(ఆంధ్రజ్యోతి):అగ్రవర్ణాలలో ఆర్య వైశ్య సామాజికవర్గం ప్రథమస్థానంలో ఉన్నందున ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయిచాలని రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమసంఘం అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీకాంత్, వెల్లంపల్లి సుబ్బారావులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణన ప్రకారం ఈ నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. సామాజిక న్యాయ దిశగా కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉదని చెబుతున్నందున ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని ప్రకటనలో తెలిపారు.

యువత పోరాటాలకు సిద్ధమవ్వాలి

ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఖమ్మంరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): భారతదేశ వెన్నుముకైన యువత పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పోరాటాలకు సిద్ధమవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన బాల రామకృష్ణ యువతకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గూడురుపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతు పాలకులు కార్పోరేట్ శక్తులకు ఊడిగం చూస్తూ యువత మేధో శక్తిని కార్పోరేటుకు అమ్ముకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగ సమస్యతో అనేక సవాళ్లతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, పాలేరు డివిజన్ సహాయకార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

లచ్చమ్మకు నివాళి

తిరుమలాయపాలెం, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిద పల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు బండ్ల లచ్చమ్మ(58)కు ఆదివారం వివిధ పార్టీలనేతలు నివాళులర్పించారు. ఆమె శనివారం మృతి చెందింది. కాగా ఆమె భౌతికకాయాన్ని డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, బీఆర్ఎస్ నాయుకలు ముదిరెడ్డి లచ్చిరెడ్డి, బోడ మంనాయాయక్, బానోతు రవి, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఎన్నికల హామీలును అమలు చేయాలి

తిరుమలాయపాలెం, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయలో ఆరుగ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనరంతరం హామీలను విస్మరించిందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయుకడు కమ్మ కోమటి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అమలుకాని వాగ్దానాలను ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలను మోసం చేసిందన్నారు. అర్హులైన వారికి రేషన్‌కార్డులు, ఇండ్లస్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకుల యడ్లపల్లినవీన్, పి.వెంకటస్వామి, మీగడ సత్యం, ఆరెంపుల వెంకన్న, రాయిండ్ల చిరంజీవి, పరికపల్లి మధు, పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు నియామకాలు చేపట్టవద్దు

నేలకొండపల్లి,మార్చి9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ఎటువంటి నియామకాలు చేపట్టవద్దని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆదివారం డప్పులతో నిరసన ప్రదర్శన నిర్వహించింది. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పగిడికత్తుల ఈదయ్య మాటాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా నియామకాలు చేపడితే ఎస్సీ, ఎస్టీ ఉప కులాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. నియామకాల్లో ఎస్సీలు, ఎస్టీ ఉప కులాలు నష్టపోకుండా ఉండాలంటే వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన అనంతరమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎమ్మార్పీఎస్ ఉద్యమిస్తుందని, చట్టబద్ధత కల్పించే వరకు పోరాడుతుందని ఈదయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాదాసు వెంకన్న, నాయకులు పొట్టపింజర బాలస్వామి, తోళ్ళ సురేష్, రాయబారపు గురవయ్య, చెరుకుమిల్లి రాజేష్, వీరబాబు, భరణి, గుడిపాటి ముక్కంటి, కుక్కల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

ఖమ్మంస్పోర్ట్స్, మార్చి9(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. పోటీలకు సుమారు 39 మంది క్రీడాకారులు హాజరైనారు. పోటీలలో భాగంగా బాలురు, బాలికలకు అండర్-10, 13, 16 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్, టోర్నీ ఆర్గనైజర్ సీహెచ్. గోపీకృష్ణ ఉన్నారు.

రామారావుకు ఘన సన్మానం


రామారావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి9(ఆంధ్రజ్యోతి): నయాబజార్ ప్రభుత్వజూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కెఎస్ రామారావు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకత సంతరించుకున్న వ్యక్తి అని ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్ సి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన రామారావుకు శనివారం రాత్రి నగరంలోని పార్క్ కన్వెషన్ హాల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మధుసూదన్‌రెడి, టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు.ఇంటర్ విద్యను బలోపేతం చేయటంలో రామారావు కీలక పాత్ర పోషించారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇంటర్ విద్యను, జూనియర్ అధ్యాపకుల సంఘాన్ని తీర్చి దిద్దినన వ్యక్తి అని కొనియాడారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు, రాష్ట్ర అధ్యక్షుడుకళింగ కృష్ణకుమార్, కె రవీందర్‌రెడ్డి, వాసిరెడ్డి శ్రీనివాస్, అనంతరం రామారావు దంపతులను ఘనంగా సన్మానించారు.

ప్రారంభమెప్పుడో..

- నిర్మాణం పూర్తైనా ప్రారంభానికి నోచుకోని వంద పడకల ఆస్పత్రి
- వైద్యం అందక ప్రజల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వంద పడకల ఆస్పత్రి నిర్మాణం

మధిరటౌన్, మార్చి9(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో వంద పడకల ఆసుపత్రి రూ.34 కోట్లతో ఐదు ఎకరాల స్థలంలో అన్ని హంగులు, వసతులతో నిర్మాణం పూర్తై ఏడాది కావస్తున్నా ప్రారంభానికి మాత్రం నోచుకోలేదు. మధిరలో ప్రస్తుతం ఉన్న ఏరియా వైద్యశాల శిథిలావస్థలో ఉంది. అది కూడా 30 పడకలతోనే ఉండటంతో ప్రజలకు సరైన వైద్యసేవలు అందకపోవడంతో, గత ప్రభుత్వ హయంలో మధిర నియోజకవర్గ కేంద్రానికి వంద పడకల ఆస్పత్రి మంజూరు చేసింది. ప్రస్తుత ఆస్పత్రి ఉన్న చోట సరిపడా స్థలం లేకపోవడంతో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలంలో ఐదు ఎకరాలు కేటాయించి ఆస్పత్రి నిర్మాణానికి రూ.34 కోట్లు మంజూరు చేయడమే కాకుండా, వెంటనే ఆనాటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన కూడా చేశారు. మంజూరైన రూ.34 కోట్లలో 23 కోట్లు బిల్డింగ్ నిర్మాణానికి కేటాయించగా, మరో మరో రూ.11 కోట్లను ఫర్నీచర్ ఇతర వైద్య పరికరాల కొనుగోలుకు కేటాయించారు. సివిల్ పనుల్లో మొత్తం 204 గదులతో నిర్మాణం పూర్తి కాగా, ఇందులో ఐదు ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ కేటాయించగా 40 గదులను డాక్టర్ల కన్సల్టేషన్‌కు, మిగిలిన వాటిని వార్డులకు, రూములకు, ఇతర అవసరాలకు కేటాయించారు. ఆసుపత్రి మిగతా సివిల్ పనులు అన్నీ ఏడాది క్రితమే పూర్తికాగా, మార్చురీ పనులు మాత్రం పూర్తి కావస్తుండగా బెడ్లు, ఎక్స్‌రే మిషన్, మరికొన్ని పరికరాలు రాగా కొంత ఫర్నీచర్ కొనుగోలు చేయాల్సి ఉంది. మధిరతో పాటు చుట్టు పక్కల దాదాపు 50 గ్రామాల ప్రజలతో పాటు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారు కూడా మధిర ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య పరీక్షలు, వ్యాక్సిన్‌లు వేయించుకునేందుకు వస్తూ ఉంటారు. అంతేకాక మధిర, బోనకల్, ఎర్రుపాలెం, వైరా, తల్లాడ మండలాతో పాటు, రైల్వే ప్రమాదాలతో పాటు రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మృతి చెందినా శవపరీక్షలకు మధిర ప్రభుత్వ ఆసుపత్రికే తీసుకు వస్తుంటారు.

ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి శిథిలావస్థలో ఉండటంతో ఆస్పత్రి స్లాబు పెచ్చులు ఊడి ఎక్స్‌రే మిషన్‌పై పడటంతో ఎక్స్‌రేలు తీయడం లేదు. అంతేకాక ఆపరేషన్ థియేటర్ స్లాబ్ పెచ్చులు కూడా ఊడటంతో ఏడాదికి పైగా ఆపరేషన్లు కూడా నిలిపి వేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఖమ్మం తరలిస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

మధిరలో ఉన్న ఏరియా ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కింద ఉన్న ఆస్పత్రిని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కిందకు మారుస్తూ జీవో విడుదల చేసే సమయంలో డాక్టర్లతో పాటు టెక్నికల్, నాన్ టెక్నికల్ స్టాఫ్‌తో పాటు మొత్తం 106 పోస్టులను మంజూరు చేసింది. కాని ప్రస్తుతం 25 మంది పని చేస్తున్నారు, వీటిలో డాక్టర్ పోస్టులు 52 మంజూరు కాగా, ప్రస్తుతం 9 మందే పనిచేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే కల్పించుకుని ఆసుపత్రికి అవసరమైన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి, డాక్టర్లు, సిబ్బందిని నియమించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

● డాక్టర్ అనిల్ కుమార్



ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి చేసి గుత్తేదారు బిల్డింగ్‌ను అప్పగించాడు. కొన్ని పరికరాలు, ఫర్నీచర్ రావాలసి ఉం ది, దానికి తోడు మంజూరైన సిబ్బందిని కూడా కేటాయించాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రారంభించిన వెంటనే ఉన్న సిబ్బంది తోటే వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

చివరి భూములు తడిసే వరకు పర్యవేక్షణ చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఈఈ రామకృష్ణ

బోనకల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బీబీసీ పరిధిలో చివరి భూములు తడిసే వరకు అధికారులు పర్యవేక్షణ జరపాలని ఇరిగేషన్ ఈఈ సీహెచ్. రామకృష్ణ సూచించారు. మండల పరిధిలోని ఆళ్లపాడు మైనర్ కాలువ పై ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు సంబంధించి నీటి తడులు అందించే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా చివర భూములకు నీళ్లు పారించేలా చూడాలని కోరారు. నీటిని వృథా చేయకుండా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎగువ ప్రాంత రైతులు దిగువ భూముల తడుల విషయంలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ తమ్మారపు లక్ష్మణ్, ఏఈఈలు రాజేష్, పిల్లలమర్రి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా వీరభద్రం

వైరా, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైరా మునిసిపల్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం కొంగర సుధాకర్ అధ్యక్షతన జరిగిన సీపీఎం బ్రాహ్మణపల్లి అగ్రహారం శాఖ సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం కానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలు ఉపాధి హామీ పథకాన్ని, ఇందిర మ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ గ్రామాల్లో భారీగా ఇళ్ల పన్నులు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపారని ఆరోపించారు. ఇండ్లస్థలాలు, డ్రెయినేజీలు సరిగా లేవని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 12న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో పైడిపల్లి సాంబశివరావు, గుత్తా వాసు, చిత్తూరి నాగేశ్వరరావు, కళావతి పాల్గొన్నారు.

పలు రోడ్లకు నిధుల మంజూరు

మధిర రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు నుంచి ఆగ్రామం పిల్లిగుట్ట దేవాలయానికి వెళ్లే రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.3.30కోట్లు మంజూరయ్యాయి. అలాగే ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా వంగవీడు, కృష్ణాపురం గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వంగవీడు గ్రామానికి రూ.4.40కోట్లు, కృష్ణాపురానికి రూ.2.20కోట్లు మంజూరయ్యాయి. ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఆయా గ్రామాల్లో పర్యటించి త్వరలో ఈ రోడ్లకు శంకుస్థాపనలు జరుగనున్న శిలాఫలకం స్థలాన్ని పరిశీలించారు. రోడ్లకు నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ అయిలూరి సత్యనారాయణరెడ్డి, నాయకులు కర్నాటి రామారావు, దారా బాలరాజు, దుంపా వెంకటేశ్వర్‌రెడ్డి, సంపసాల రామకృష్ణ పోచేపల్లి శంకర్‌రావు, అంకె రవి, మీనుగు చైతన్య పాల్గొన్నారు.



కృష్ణాపురంలో రోడ్డు నిర్మాణ శిలాఫలక స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బకాయిలను అవినీతిగా చూపుతున్న ఏపీఎం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆదినారాయణ



మాట్లాడుతున్న తోట రామాంజనేయులు

కల్లూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): తమతో అసభ్యకరంగా ప్రవర్తించి, అవమాన పరుస్తున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేస్తే, విచారణ నుంచి తప్పించుకునేందుకు బకాయిలను అవినీతిగా చూపిస్తున్నాడని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణలు ఆరోపించారు. ఆదివారం కల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏపీఎం రాంబాబు మీడియాకు వివరించినట్లుగా నిధులు గోల్‌మాల్ కాదన్నారు. కేవలం రికవరీ చేయాల్సిన నిధులు మాత్రమేనని, అవి కూడాను సభ్యుల దగ్గరే ఉండి పోయాయన్నారు. రికవరీ చేయాల్సిన డబ్బులను గోల్‌మాల్‌గా చూపెట్టి మీడియాకు, అధికారులకు, ప్రజలకు, స్థానిక ఎమ్మెల్యేకు సైతం పక్కదారి పట్టించారన్నారు.

ఎమ్మెల్యే విచారణ సమయంలో నిధులు గోల్‌మాల్ కాదని, రికవరీ అని కూడా ఏపీఎం అంగీకరించాడని వారు స్పష్టం చేశారు. గ్రా మదీపికలను అసభ్యకరంగా మాట్లాడినందుకు ఏపీఎంపై ఎమ్మెల్యే రాగమయి కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. మధిర మండలంలో రాంబాబు పని చేసిన సమయంలో అనేక అక్రమాలకు పాల్పడిన పలు సంఘటనలపై వారు విలేకరులకు వివరించారు. వీవోఏలను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్న ఏపీఎంను కల్లూరు నుంచి వెంటనే బదిలీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్, ఎస్ఎఫ్ఐ డబ్లు డివిజన్ కార్యదర్శి యస్‌కె రంజాన్‌బి, వీవోఏల సంఘం జిల్లా కన్వీనర్ వేము నాగమణి, నాయకురాలు జె. కుమారి తదితరులు పాల్గొన్నారు.

నాగిలిగొండలో సీసీ రోడ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

చింతకాని, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో రూ. 29 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్లకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు ఆదివారం శంకుస్థాపన చేశారు. సందర్భంగా నిధులు మంజూరుకు కృషి చేసిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండపల్లి శేఖర్‌రెడ్డి, కూరపాటి కిషోర్, జమ్ముల జితెందర్‌రెడ్డి, ఏపూరి రవీంద్రబాబు, సట్టు వెంకటేశ్వర్లు, జమ్ముల కృష్ణారెడ్డి, వేపూరి సత్యం, అశోక్‌రెడ్డి, పదిమల వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్, మార్చి9(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. పోటీలకు సుమారు 39 మంది క్రీడాకారులు హాజరైనారు. పోటీలలో భాగంగా బాలురు, బాలికలకు అండర్-10, 13, 16 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్, టోర్నీ ఆర్గనైజర్ సీహెచ్. గోపీకృష్ణ ఉన్నారు.

వేంసూరుకు చేరిన గోదావరి జలాలు

వేంసూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): సీతారామప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు వేంసూరు చేరడంతో ఆదివారం ఎన్టీఆర్ కెనాల్ వద్ద కాంగ్రెస్ నాయకులు, రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ జలపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోదావరి జలాలు వేంసూరుకు రావడంతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కాసర చంద్రశేఖర్‌రెడ్డి, సోమిరెడ్డి, ఎండి ఫైజుద్దిన్, తుమ్మూరు రామిరెడ్డి అట్లూరి సత్యనారాయణరెడ్డి, ఎర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గోదావరి జలాల వద్ద పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుమ్ముతో పరేషాన్

- కంటి తుడుపుగా వాటర్ క్యూరింగ్
- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు



వాహనాల టైర్ల వెంట వస్తున్న విపరీతమైన దుమ్ము

వైరా, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణంలో అంతా డొల్లతనమే కన్పిస్తుంది. రూ.12కోట్లతో దాదాపు ఏడెనిమిది నెలల కిందట చేపట్టిన ఈ నిర్మాణం నత్తనడకను తలపిస్తుంది. అడపాదడపా జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ నిర్మాణంలో వెట్ మిక్స్ పనులు జరుగుతున్నాయి. అయితే వెట్ మిక్స్ మిశ్రమం తక్కువగా ఉండి కంకరే ఎక్కువగా పోస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతే కాకుండా నిత్యం వాటర్ క్యూరింగ్ చేస్తూ ఈ పనులు చేయాల్సి ఉండగా కంటి తుడుపుగా వాటర్‌క్యూరింగ్ చేస్తున్నారు. దాంతో రోడ్డుపైన కంకర తేలి ఆడుతుంది. వెట్‌మిక్స్ మిశ్రమం సమపాళ్లలో ఉంటే చేసిన రోడ్డు పనులు పటిష్టంగా ఉండేవి. అయితే రోడ్డు అంచుల్లో వెట్ మిక్స్ లేక కంకరే కన్పిస్తుంది.

రూ.12కోట్లతో 1.8కిలోమీటర్ల దూరం ఈ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు కిలోమీటర్ దూరంలోపే పనులు మొదలయ్యాయి. ఏడెనిమిది నెలల కిందట ఈ పనులు మొదలు పెట్టినా ఇంకా వెట్‌మిక్స్ పనులే జరుగుతున్నాయి. సదరు కాంట్రాక్టర్ జిల్లాలోని అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడి కుమారుడు కావడంతో ఆర్అండ్‌బీ అధికారులు ఈ పనుల్లో నాణ్యత, వేగంపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్రషర్ల వద్ద కంకర లభ్యత లేదనే కారణంతో పూర్తిగా నెలరోజులపాటు రోడ్డు పనులు నిలిపివేశారు. మళ్లీ వారంరోజుల నుంచే ఈ పనులు నత్తనడకగా జరుగుతున్నాయి. సరిగా వాటర్ క్యూరింగ్ లేనందున రోడ్డు నిర్మాణంలో పటిష్టత కొరవడటమేకాకుండా వాహనాల టైర్ల వెంట విపరీతమైన దుమ్ము లెగుస్తూ ఇతర వాహన చోదకులను, స్థానికంగా ఉన్న వందలాది నివాసాల ప్రజలను తీవ్ర ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. నాలుగులైన్ల రోడ్డు, డివైడర్, డ్రెయినేజీని నిర్మించాల్సి ఉంది. ఇంకా అరకిలోమీటర్‌కుపైగా రోడ్డు నిర్మాణ పనులు మొదలే కాలేదు. చేస్తున్న పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. సెంట్రల్ లైటింగ్ కూడా నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు నాణ్యతతో కూడిన వెట్‌మిక్స్‌ను పూర్తిస్థాయిలో వాటర్‌క్యూరింగ్ చేస్తూ రోడ్డును నిర్మించాలని, దుమ్ము లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



రాములు కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చింతకాని, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమండవ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తుపాకుల అగ్గిరాములు ఇటీవల మృతి చెందడంతో ఆదివారం మృతుని కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. రాములు కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, పర్చగాని ఏడుకొండలు, కందిమల్ల శీను, మరీదు లక్ష్మీనారాయణ, సోంపోగు ఏసోబు, దారెల్లి నాగరాజు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను అమలు చేయాలి'

తిరుమలాయపాలెం, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయలో ఆరుగ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అనరంతరం హామీలను విస్మరించిందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకుడు కమ్మ కోమటి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అమలుకాని వాగ్ధానాలను ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలను మోసం చేసిందన్నారు. ఈకార్యక్రమంలో యడ్లపల్లినవీన్, పి.వెంకటస్వామి, మీగడ సత్యం, వెంకన్న, చిరంజీవి పాల్గొన్నారు.

కనులపండువగా ప్రతిష్ఠా మహోత్సవం

సత్తుపల్లిరూరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం కనులపండువగా సాగింది. ప్రతిష్ఠాచార్యులు శ్రీమాన్ ప్రతాపురం గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి సేవా ట్రస్ట్ నిర్వాహకులు ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. చతుస్థానార్చన, బాలభోగ నివేదన, విశేష హోమాలు, జపములు, పారాయణాదులు, ప్రతిష్ఠ విగ్రహాలకు కర్మాంగ స్నపనమం, నిత్య పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, చతుస్థానార్చన, విశేష హోమాలు, జపములు, పారాయణాదులు, ప్రాణ ప్రతిష్ఠ హోమాలు, నిత్యపూర్ణాహుతి, ప్రతిష్ఠ మూర్తులకు ధన, పుష్ప, ఫల, వస్త్రశయ్యాధివాసములు, తీర్థప్రసాద వితరణ సాగింది. ప్రతిష్ఠకు హాజరైన సుమారు 15వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం, అన్నమాచార్య సంకీర్తన జరిపించారు.



పూజలు చేస్తున్న అర్చకులు



రామాలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెంలో కోదండరామస్వామి విగ్రహ, ధ్వజ యంత్ర ప్రతిష్ఠ

ఎర్రుపాలెం, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యనారాయపురం గ్రా మంలో గ్రామస్థుల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సీత, హనుమ, లక్ష్మణ సమేత కోదండరాముని విగ్రహప్రతిష్ఠను ఆదివారం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠతోపాటు ఆలయంలో యంత్ర, ధ్వజస్థంబ, శిఖరప్రతిష్ఠలను నిర్వహించారు. ఈప్రతిష్ఠలకోసం గత మూడురోజులుగా యాగశాలలో హోమాలు, మండపారాధనలు,న్యాసాలు, ప్రాతఃకాల పూజలు, అర్చనలు నిర్వహించారు. అంతేకాక గ్రామంలో ముత్యాలమ్మ గ్రామదేవత, బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం శాంతికల్యాణం గావించారు. ముత్యాలమ్మకు తొలిబోనాలను సమర్పించారు. అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

9 మందిపై కేసు నమోదు

ఏన్కూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ప్రధాన రహదారిపై యువకుడి మృతదేహంతో రాస్తారోకో చేసిన సంఘటనలో తొమ్మిది మందిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందిరానగర్ కాలనీ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో టీఎల్‌పేటకు చెందిన పసుపులేటి కృష్ణ అనే యువకుడు మృతి చెందిన సంగతి తెలిసిందే. యువకుడి మృతికి టాటా ఏస్ వాహన యజమాని శేఖర్ కారణమని ఆరోపిస్తూ మృతుడి బంధువులు శేఖర్ ఇంటిదగ్గర గొడవచేసి డబ్బులు చెల్లించాలని వత్తిడి చేయడం, బెదిరించడం అదే వ్యవహారంపై ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేయడం ట్రాఫిక్ అంతరాయం కలిగించడం, తదితర సంఘటనలకు సంబంధించి తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రఫీ తెలిపారు.

మహిళ అదృశ్యం

కల్లూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో మహిళ అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో స్థానిక మెయిన్ సెంటర్‌లో కనిపించకుండా పోయిందని బాధితురాలి తల్లి ఫిర్యాదుతో స్థానిక ఎస్‌ఐ హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత పోరాటాలకు సిద్ధమవ్వాలి

- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ఖమ్మంరూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై యువత పోరాటాలకు సిద్ధమవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన బాల రామకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గూడురుపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిద్దినేని కర్ణకుమార్, పుచ్చకాయల సుధాకర్, శ్రీనాథ్ రెడ్డి, రవి తదితరులున్నారు.

మక్కల కొనుగోళ్లు ప్రారంభం



మక్కలను కాటా వేస్తున్న హామాలీలు

చింతకాని, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మక్కల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. సమృద్ధిగా కురిసిన వర్షాలు, సాగర్ నీటి లభ్యతతో మండల వ్యాప్తంగా రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 2225కు మించి ప్రైవేటు వ్యాపారులు మొక్కజొన్నలను రూ. 2250 కొనుగోలు చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధరతో పాటు దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉండటంతో మక్క రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంట కోతలు, అమ్మకాలు మే నెల చివరి వరకు కొనసాగే అవకాశం ఉన్నది. వ్యాపారులు జిల్లాలో కొనుగోలు చేసిన మొక్కజొన్నలను హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హనుమాన్ జంక్షన్, దేవరపల్లి, చింతలపూడి, తణుకు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, కైకలూరు ప్రాంతాలలోని కంపెనీలకు ఎగుమతులు చేస్తారు. వ్యాపారులు ప్రస్తుతం ఉన్న ధరతోనే చివరి వరకు మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆర్యవైశ్యులకు 'ఎమ్మెల్సీ' కేటాయించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి9(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయిచాలని రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్ధంశెట్టి శ్రీకాంత్, వెల్లంపల్లి సుబ్బారావులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణన ప్రకారం ఈ నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు. సామాజిక న్యాయదిశగా కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉందని చెబుతున్నందున ఆర్యవైశ్యులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని కోరారు.